RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 22 సెప్టెంబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:98

## సిఎంఓ అధికారులు నిరంతరం గ్రౌండ్ కి వెళ్లి సమీక్ష చేయాలి

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




ఎంసి ఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష..

హాజరైన ఎంపీ వేం నరేందర్ రెడ్డి,సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్,ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ , సీఎం వో కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జె. చోంగ్తు , మున్సిపల్ శాఖ సెక్రటరీ టి.కె శ్రీదేవి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ,ఇతర ఉన్నతాధికారులు

హాస్పిటల్ భవనం నిర్మాణం పైన పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి..

గ్రీన్ ఛానల్ లో నిధులు మంజూరు చేస్తున్నా ఎందుకు పనులు వేగం గా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం..

వచ్చే 30 రోజుల్లో 24 గంటల పాటు పని జరగాలి..

వర్క్ షెడ్యూల్ తయారు చేసుకొని ముందుకు వెళ్లాలి..సిఎంఓ అధికారులు నిరంతరం గ్రౌండ్ కి వెళ్లి సమీక్ష చేయాలి

ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షణ చేయాలి..

ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలి..

ఇక నుంచి ప్రతి రోజు కలెక్టర్ ఆస్పత్రి పనులను పర్యవేక్షించాలి..

శాఖల మధ్య సమన్వయం తో పని చేయాలి..

కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలి..

త్వరలో ఓపి సేవలు అందుబాటులోకి తీసుకురావాలి..హాస్పిటల్ చుట్టూ మంచి వాతావరణం ఉండేలా పరిసరాల్ని తీర్చి దిద్దాలి..

సనత్ నగర్ టిమ్స్ తరహా లో ఓపి సేవలు వరంగల్ లో అందుబాటులోకి తీసుకురావాలి

సనత్ నగర్ టిమ్స్ లో స్టాఫ్ క్వాటర్స్ ఏర్పాటు చేయాలి..తక్షణమే స్టాఫ్ క్వాటర్స్ పనులు ప్రారంభం కావాలి..

హాస్పిటల్ మెయింటెన్స్ ను ఏజెన్సీ కి అప్పగించాలి..

## 13 రోజుల పాటు దసరా సెలవులు ప్రకటించిన ప్రభుత్వం



హైద్రాబాద్ సెప్టెంబర్ 21;తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దసరాతో పాటు బతుకమ్మ కూడా వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది.

## కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి: జూపల్లి కృష్ణారావు

**కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు చేశారన్న జూపల్లి**

**వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపాటు**

**జూరాల వద్ద రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్ల 5.50 లక్షల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన**



గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

**'హోమా సీఎంఈ 2026' జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

వార్తా 2 లో

## పట్టణ పేదల సొంతింటి కలకు తొలి అడుగు

**ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన**

**రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో నిర్మాణ పనులకు శ్రీకారం**

**పేదవాడి ఆత్మగౌరవమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యం**

**పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**

**వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే బోనాలు ఎత్తించేలా పనులు పూర్తి చేస్తాం**

**ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంత ఇళ్లు.. ఉచిత రిజిస్ట్రేషన్‌తో హక్కులు**


**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలోని క్యూర్ పరిధిలో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలోని మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ పేదలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు.

పేదలను నగరానికి దూరంగా తరలించడం కాకుండా, ఖరీదైన ప్రాంతాల్లోనే గౌరవంగా నివసించేలా ఇందిరమ్మ టవర్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.

పేదవాడి సొంతింటి కలను కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యం కాదని, పేదవాడికి ఆత్మగౌరవంతో జీవించే చిరునామా ఇవ్వడమే లక్ష్యమని అన్నారు.




మిగతా 2 లో

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..


## పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు.

అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది.మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



**రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:**బాలాపూర్ వినాయక నవరాత్రి ఉత్సవాలలో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు.. ఈ పూజ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ సచిన్ సావంత్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి రుద్రరాజు, మహేశ్వరం ఇంచార్జ్ కే.ఎల్.ఆర్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

22 సెప్టెంబర్ 2026 మంగళవారం

# జెన్-జీలో తగ్గని బీజేపీ క్రేజ్ !

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్తంగా నవతరం యువత జెన్–జీ మనోగతంపై జరుగుతున్న ప్రచారాలకు తెరదించాయి. కేంద్రంలో బీజేపీ వరుసగా అధికారంలో ఉన్నందున .. ఉద్యోగాలు, నిరుద్యోగం, అగ్నివీర్ వంటి అంశాలను అడ్డంపెట్టుకుని జెన్–జీ ఓటర్లు బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి క్రమంగా దూరమవుతున్నారంటూ ఇండియా కూటమి, వామపక్ష వర్గాలు చేసిన ప్రచారాలు డీయూ వేదికగా తేలిపోయాయి. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో నాలుగు కీలక పోస్టులలో మూడింటిని ఏబీవీపీ ఏకపక్షంగా కైవసం చేసుకోవడం ద్వారా.. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో నేటి తరం యువత ఇప్పటికీ బీజేపీ అనుబంధ సంస్థల వైపే అత్యంత బలంగా నిలబడుతోందని తేలిపోయింది.దేశ నలుమూలల నుంచి వివిధ నేపథ్యాలు, సంస్కృతులు, సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన దాదాపు లక్షన్నర మందికి పైగా విద్యార్థులు ప్రాతినిధ్యం వహించే మినీ ఇండియాలాంటి క్యాంపస్ ఢిల్లీ విశ్వవిద్యాలయం. అలాంటి చోట స్వచ్ఛందంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఏబీవీపీ అభ్యర్థులకు జైకొట్టారంటే.. యువ ఓటర్లు ఇప్పటికీ మోదీ మార్క్ జాతీయవాదం, స్థిరమైన అభివృద్ధి అజెండాకే పట్టం కడుతున్నారని రుజువవుతోంది. కేవలం భావోద్వేగ నినాదాలకే పరిమితం కాకుండా, లైబ్రరీ టైమింగ్స్ విస్తరణ, క్యాంపస్ స్పెషల్ మెట్రో ఫీడర్ బస్సులు, హాస్టల్ సదుపాయాలు, మహిళా భద్రత వంటి ప్రాక్టికల్ సమస్యలపై నిరంతరం పోరాడే ఏబీవీపీని విద్యార్థులు తమ గొంతుకగా ఎంచుకున్నారు.మరోవైపు ప్రతిపక్షాలు నిర్మించిన నెరేటివ్స్ క్యాంపస్‌లలో ఏమాత్రం పనిచేయలేదనడానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యం. కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐతో పాటు వామపక్ష కూటమి విద్యార్థుల మధ్య ప్రవేశపెట్టిన యాంటీ–బీజేపీ సెంటిమెంట్ క్షేత్రస్థాయిలో పటాపంచలైంది. చివరికి ఆ వ్యతిరేకత కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలకే దారితీసి.. సొంత రెబల్ అభ్యర్థే రికార్డు మెజారిటీతో నెగ్గేలా చేసిందే తప్ప, వ్యవస్థీకృతంగా విద్యార్థులను ఆకట్టుకోవడంలో ప్రతిపక్షాలు ఘోరంగా బోల్తా పడ్డాయి. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్యాంపస్‌లలో విశ్వసనీయత సంపాదించుకోవడంలో ఏబీవీపీ వేసిన రూట్ మార్చేలా చేయడంలో విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి.ఈ ఎన్నికల సరళిని విశ్లేషిస్తే నవతరం ఓటర్లు కేవలం ప్రతిపక్షాల విమర్శలను గుడ్డిగా నమ్మడం లేదని, ఎవరు క్షేత్రస్థాయిలో పక్కాగా డెలివర్ చేయగలరనే ఆచరణాత్మక ఆలోచనతోనే ఓటేస్తున్నారని స్పష్టమైంది. జెన్–జీ ఓటు బీజేపీ నుంచి చేజారిపోతోందన్నది కేవలం సోషల్ మీడియా బబుల్స్‌లో సాగే ఊహాగానం మాత్రమేనని, వాస్తవ ఎన్నికల బ్యాలెట్ వద్దకు వచ్చేసరికి బీజేపీ భావజాలానికి నవతరం యువత తిరుగులేని మద్దతు లభిస్తోందని ఈ డీయూఎస్‌యూ తీర్పు బలంగా చాటిచెప్పింది. ఇప్పటివరకు ప్రధానంగా ఏకపక్ష సందేశాలకే పరిమితమైన ప్రచార విధానానికి బదులుగా.. ఇకపై యువతతో ద్విముఖ సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతతో తమ పార్టీకి ఉన్న కమ్యూనికేషన్ లోటును జెన్–జీ ఉద్యమం స్పష్టంగా బయటపెట్టిందని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత తరం బాధ్యతాయుతమైన సమాధానాలు కోరుతోందని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని, వ్యవస్థలో సమూల మార్పులు అవసరమనే భావన యువతలో బలంగా ఉందని పార్టీ గుర్తించినట్లు తెలుస్తోందిఎక్స్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు జెన్–జీని సమర్థంగా చేరుకోవడంలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఈ వేదికలను మరింత సమర్థంగా వినియోగిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయని బీజేపీ భావిస్తోంది. దీంతో సోషల్ మీడియా వ్యూహంలో మార్పులు తప్పనిసరి అయ్యాయని నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, రెడ్డిట్ మాధ్యమాల్లో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా యువకులతో కూడిన సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇలాంటి బృందాలు ఉంటే ప్రభుత్వ విధానాలు, పార్టీ సందేశాలను యువతకు వారి భాషలో, వారికి నచ్చే శైలిలో చేరవేయవచ్చని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. యువతతో సమర్థవంతంగా మాట్లాడాలంటే యువతే ప్రధాన పాత్ర పోషించాలని, పెద్దలు కూడా వారితో మాట్లాడేటప్పుడు వారి శైలినే అనుసరించాల్సి ఉంటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును పార్టీ ఉదాహరణగా చూపుతోంది. విద్యార్థుల ఆందోళనల సమయంలో ప్రధాని సెల్ఫీ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడం యువతను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయమని పార్టీ నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువ యాక్టివ్‌గా ఉండే సమయాన్ని, వారికి చేరువైన మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా వారితో మమేకమయ్యే ప్రయత్నం చేశారని పేర్కొంటున్నారు. అంతేకాకుండా, కేంద్ర మంత్రులు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో మరింత చురుకుగా ఉండాలని, ప్రజలతో ఇంటరాక్టివ్‌గా వ్యవహరించాలని కేబినెట్ సమావేశంలో ప్రధాని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఇటీవల జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో భారతదేశం వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల కలిగే ప్రయోజనాలను, చైనాతో పోలికలను, రాష్ట్రాల వారీగా లాభాలను వివరించారు. ఈ తరహా అంశాలను కేవలం గణాంకాల రూపంలో కాకుండా ఇన్‌స్టా రీల్స్, చిన్న వీడియోలు, గ్రాఫిక్స్, ప్లకార్డుల ద్వారా సులభంగా అర్థమయ్యే విధంగా యువతకు చేరవేయాలని పార్టీ ఆలోచిస్తోంది. ప్రభుత్వ విజయాలను ఆకర్షణీయమైన రూపంలో ప్రజెంట్ చేయడం ద్వారా యువతను మరింతగా ఆకట్టుకోవచ్చని భావిస్తోంది.నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో రీ–ఎగ్జామినేషన్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత వివాదం తగ్గిపోతుందని భావించినప్పటికీ, అది జరగలేదని బీజేపీ నేతలు విశ్లేషిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ చర్యలను విద్యార్థులకు సమర్థవంతంగా వివరించలేకపోవడమేనని వారు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జెన్–జీతో నిరంతర, పారదర్శక, వేగవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందించేందుకు బీజేపీ కసరత్తు ప్రారంభించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.రానున్న రాష్ట్ర ఎన్నికలతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ బీజేపీ పట్ల యువత ఆకర్షణ చెక్కుచెదరలేదనడానికి ఈ ఫలితాలే గట్టి తార్కాణంగా నిలుస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది.

# హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

**టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు**

**కొత్త తరహా ఆలోచనలకు అండగా ప్రభుత్వం**

**'హోమా సీఎంఈ 2026' జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో**

**మంత్రి శ్రీధర్ బాబు**





దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్ కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్ కేర్ తో సమర్థవంతంగా అనుసంధానం చేసే కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీ–హబ్ లో 'బియాండ్ నంబర్స్ -- ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్' అనే అంశంపై 'హోమా సీఎంఈ 2026' పేరిట నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మెడిసిన్‌ను టెక్నాలజీతో మిళితం చేస్తున్నామన్నారు. మారుతున్న ఆధునిక జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాకుండా, లైఫ్ స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశముందన్నారు. ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా... ప్రముఖ వైద్యులు డా.ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే... ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్ ప్లోరర్'ను ప్రారంభించారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ)' పేరిట ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్‌ను అందించే కార్యక్రమానికి కూడా ఆయన శ్రీకారం చుట్టారు.

# పట్టణ పేదల సొంతింటి కలకు తొలి అడుగు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎకరం వందల కోట్ల విలువ చేసే ప్రాంతంలో పేద కుటుంబాలకు ఇల్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారికి భద్రత, భరోసా కల్పిస్తోందన్నారు.


ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, సేల్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు.

లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, ఎవరి సిఫార్సులు, ఒత్తిళ్లకు లొంగకుండా అర్హత ఆధారంగా ఎంపిక జరుగుతోందన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా 'క్యూర్' ప్రాంతంలో లాటరీ ఎంపికలను పబ్లిక్‌గా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు.

ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతగా 480 ఇళ్ల చొప్పున నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే పలుచోట్ల టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు వేగం పుంజుకుంటాయని చెప్పారు.

ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. "ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి పేద కుటుంబం నిరాశ చెందాల్సిన అవసరం లేదు. రెండో విడత, మూడో విడత, నాలుగో విడత, ఐదో విడతగా కూడా ఇళ్లు నిర్మిస్తాం. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో 'క్యూర్' ప్రాంతంలో అర్హులైన పేదలకు దశలవారీగా ఇళ్లు అందిస్తాం" అని మంత్రి హామీ ఇచ్చారు.



ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలను వేగవంతం చేస్తామని అన్నారు.

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, లబ్దిదారులు తమ ఇల్లు ఎలా కడుతున్నారో మీ కళ్ల ముందే మీరు చూసుకోవచ్చు. వారానికి ఒకసారి వచ్చి నిర్మాణ పనులను పరిశీలించండి. నాణ్యతలో లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయండి. ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు..

"ఇది ప్రభుత్వం ఇచ్చే ఒక గిఫ్ట్ కాదు.. మీ పిల్లలకు, మీ భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి. రాయదుర్గం వంటి ప్రాంతంలో 'నాకూ ఒక సొంత అపార్ట్‌మెంట్ ఉంది' అని మీ పిల్లలు గర్వంగా చెప్పుకునేలా ఈ ఇంటిని కాపాడుకోండి" అని మంత్రి కోరారు.

గతంలో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి నగరానికి 30--40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన విధానాలకు భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డునే పేదలకు ఇళ్లు నిర్మిస్తోందని మంత్రి అన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదల ఇళ్ల విషయంలో ఇచ్చిన హామీలు, అమలు చేసిన పనులపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆపన్నహస్తం

**రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి సిఫారసుతో 223 మందికి**

**రూ.78.17 లక్షల సాయం**

**లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**

**క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి**





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 21:**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన, అలాగే ఉభయ జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 223 మందికి పైగా లబ్ధిదారులకు..రూ.78.17 లక్షల విలువ చేసే చెక్కులను.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చెయ్యాలి

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం**

**25 రోజుల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. పంటలను కాపాడేందుకు గోదావరి జలాల వినియోగం**

**కమలాపురం పంప్‌హౌస్ నుంచి అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల**

**కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం**







**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 21:** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు.

యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టన్నెల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

తదుపరి ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించి,మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ , సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీటిని అందించే దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.టన్నెల్‌లో కొన్ని ప్రాంతాల్లో కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీట్‌తో పూర్తిస్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించామని చెప్పారు. టన్నెల్ పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

అక్టోబర్‌లో సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను వేగవంతం చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించామని తెలిపారు.

సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించామని చెప్పారు.

ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని, ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు విద్యుత్ రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. అందువల్ల నీటి లభ్యత, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.

నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్‌లైన్‌తో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

కమలాపురం వద్ద పంప్ మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. విడుదలైన నీరు ఆయకట్టులోని రైతులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని మంత్రి తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురం--మణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గి సాగుకు నీటి భరోసా పెరుగుతుందని మంత్రి అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ గౌలీగూడ ఉస్మాన్‌షాయిలో దుర్గా సేవన్ సంగ్అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ ఎం.అంజన్ కూమార్ యాదవ్ కేడీసీసీ కార్యదర్శి ఎస్ .ధన్‌రాజ్ అసోసియేషన్ నిర్వాహకులు స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో దుర్గా సేవన్ సంగ్అసోసియేషన్ నిర్వాహకులు వెంకటేష్ యాదవ్ అశోక్ యాదవ్ వసంత్ ,సందీప్‌యాదవ్ రూపేష్ యాదవ్ ,రవీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## TNGOs MACH Society Ltd., Gachibowli డైరెక్టర్ ఎన్నికల్లో TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్ ఘన విజయం





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్: TNGOs MACH Society Ltd., Gachibowliలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ పదవులకు నిన్న జరిగిన ఎన్నికల్లో TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్ అభ్యర్థులు శ్రీ కారం రవీందర్ రెడ్డి మరియు కట్కూరి శ్రీకాంత్ విజయం సాధించారు.

మొత్తం 2,107 మంది సభ్యులకు గాను 867 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 7 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి.

కారం రవీందర్ రెడ్డి -- 583 ఓట్లు

కట్కూరి శ్రీకాంత్ -- 302 ఓట్లు

ఎన్నికల అధికారి మోహన్ రావు ఇరువురిని విజేతలుగా అధికారికంగా ప్రకటించారు.

ఎన్నికల సందర్భంగా శ్రీమతి ఉమాదేవి, గోవర్ధన్ రెడ్డి TNGOs యూనియన్ అధికారిక ప్యానెల్‌కు మద్దతుగా తమ అభ్యర్థిత్వాన్ని విరమించుకోవడం విశేషం.

ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను కె. స్వామిగౌడ్, సుధాకర్, దేవిప్రసాదరావు, మీమిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్, ముజీబ్, ఎం.ఏ. హమీద్ తదితరులు అభినందించారు.

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...

విజయవాడ, సెప్టెంబర్ 21,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది.ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది.ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవనిగా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

కాకినాడ, సెప్టెంబర్ 21,ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు.సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ.పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది.

అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు.

సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

తిరుమల, సెప్టెంబర్ 21, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది.ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే.ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది.మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది.

ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది.

కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమిషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమిషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

ఛైర్మన్ పీఏ ? ఛైర్మన్ చెప్పకుండా చేయగలడా?

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక ఛైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి.ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్‌ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమిషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం.

అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు ఛైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?

ఒంగోలు సెప్టెంబర్ 21, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు.జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకో కూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుక బడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కారులో ఊపిరాడక చిన్నారి మృతి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాద ఘటన జరిగింది. కారు లాక్ అవ్వడంతో ఊపిరాడక నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. జూలూరుపాడు మండలం వినోభానగర్ గ్రామ సర్పంచ్ నవీన్, ఐశ్వర్య దంపతులకు ఇద్దరు పిల్లలు తన్విత్రశ్రీ (4), సురక్ష. ఆదివారం స్కూలుకు సెలవు కావడంతో, ఇంటి వద్ద ఆడుకుంటూ లాక్ చేయని కారులో తన్వితశ్రీ ఎక్కింది. కారు ఎక్కగానే కారు లాక్ అవ్వడంతో, కాసేపటికి ఊపిరాడక చిన్నారి స్పృహ తప్పింది. కాసేపటికి కూతురు కనిపించడంలేదని తల్లి చెప్పడంతో ఊరంతా వెతికి, అనుమానంతో కారులో చూడగా స్పృహ తప్పి పడిపోయిన తన్వితశ్రీని గుర్తించి స్థానికులు బయటికి తీసారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.

# జూబ్లీహిల్స్‌లో హామ్లీస్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ప్రారంభం

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ప్రముఖ టాయ్ రిటైలర్ హామ్లీస్ తన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించింది. మూడు అంతస్తుల్లో 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ స్టోర్‌లో 10 వేలకు పైగా బొమ్మలు, ఆటలు, గిఫ్ట్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయి. పిల్లలు, కుటుంబాలకు ఆట, ఆవిష్కరణ, ఊహాశక్తిని పెంపొందించేలా ప్రత్యేక అనుభవాలను అందిస్తోంది.

## జాబ్ క్రియేటర్లదే భవిష్యత్తు: ఏపీ మాజీ ఐటీ సలహాదారు డాక్టర్ జె.ఎ. చౌదరి

సంప్రదాయ ఉద్యోగ విధానాన్ని ఏఐ సమూలంగా మార్చేస్తోందని, గ్రాడ్యుయేట్లు క్యాంపస్ రిక్రూట్మెంట్ కోసం ఎదురుచూసే కాలం చెల్లిందని ఏపీ మాజీ ఐటీ సలహాదారు డాక్టర్ జె.ఎ. చౌదరి అన్నారు. హైదరాబాద్లో అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఏఎస్బీ) నిర్వహించిన ఇండస్ట్రీ లీడర్షిప్ సమిట్లో ఆయన మాట్లాడుతూ, సమస్యలకు పరిష్కారాలు చూపుతూ, ఉద్యోగాలు సృష్టించగల ఎంట్రప్రెన్యూర్లదే భవిష్యత్తు అని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఐబీఎం, జెన్పాక్ట్, మైక్రాన్ టెక్నాలజీ, ఫెడెక్స్ తదితర కంపెనీల సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ వ్యాపార రంగంలో ఏఐ ప్రభావంపై చర్చించారు. డిగ్రీలు ఇవ్వడమే కాకుండా విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఏఎస్బీ సెక్రటరీ అర్జున్ కుమార్, డైరెక్టర్ అరిజిత్ సంతికరీ ప్రకటించారు.

## అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు.. టికెట్ దక్కేదెవరికి.?

హైదరాబాద్, సెప్టెంబర్ 21, దానం నాగేందర్పై హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగడం దాదాపు ఖాయమైంది. బీఆర్ఎస్లో అప్పుడే ఖైరతాబాద్ బైపోల్పై చర్చ మొదలైంది. నిన్నటి వరకు దానం నాగేందర్పై పోరాటం చేసిన బీఆర్ఎస్..ఇప్పుడు అదే సీటును తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు స్టార్ట్ చేస్తోంది. అందుకే..అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని డిసైడ్ అయింది గులాబీ పార్టీ అధిష్టానం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారట.పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన విష్ణుకు..నియోజకవర్గంతో ఉన్న పాత పరిచయాలు, పీజేఆర్ కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఖైరతాబాద్కు బైపోల్ వస్తే విష్ణువర్ధన్ రెడ్డిని బరిలో దింపే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు కూడా ఎప్పటినుంచో ప్రచారం ఉంది.గతంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేరు కూడా టికెట్ రేసులో వినిపిస్తోంది. గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన శ్రవణ్..ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో పాటు..బీసీ సామాజిక సమీకరణాలు కూడా తనకు అనుకూలంగా మారుతాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరో నేత తలసాని సాయికిరణ్ పేరు ఈ రేసులోకి రావడం మరింత ఆసక్తి రేపుతోంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ కూడా ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు టాక్.ఉపఎన్నిక రాబోతుందని ప్రచారం నడుస్తున్నప్పటి నుంచి సాయికిరణ్ను బరిలోకి దింపాలని తలసాని ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం నడిచింది. సంక్రాంతి సందర్భంగా ఖైరతాబాద్ పరిధిలో జరిగిన కార్యక్రమాల విషయంలోనూ తలసాని, దానం వర్గాల మధ్య పోటాపోటీ కనిపించిందన్న చర్చ అప్పట్లో జరిగింది. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికలో తనయుడు సాయికిరణ్ను పోటీ చేయించేందుకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది.తలసాని సాయికిరణ్ 2019 లోక్సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు.మరోవైపు పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. 2014లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన మన్నె..2018, 2023లో దానం నాగేందర్కు అవకాశం ఇవ్వడంతో సీటు త్యాగం చేసి సహకరించారని ఆయన వర్గం చెబుతోంది. విష్ణువర్ధన్రెడ్డి..దాసోజు..సాయికిరణ్..మన్నె గోవర్ధన్రెడ్డి.. నలుగురి పేర్లు ఇప్పుడు ప్రచారంలో ఉన్నప్పటికీ..ఇక్కడే బీఆర్ఎస్ అసలు కసరత్తు మొదలుపెడుతుందట. ఎవరికి స్థానికంగా బలం ఉంది.? క్యాడర్ను నడిపించే సామర్థ్యం ఉన్న లీడర్లు ఎవరు.? సామాజిక సమీకరణాలు ఏంటి.? కాంగ్రెస్ అభ్యర్థిని ఢీకొట్టేందుకు ఎవరైతే సరైన అభ్యర్థి.? ఇలాంటి అంశాలన్నింటినీ పరిశీలించాకే అభ్యర్థిని ఫైనల్ చేయాలని గులాబీ అధిష్టానం భావిస్తోందన్న చర్చ జరుగుతోంది.గత బైపోల్స్ అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకుని..చివరి నిమిషం వరకు అభ్యర్థి ఎంపికపై సర్వేలు, ఫీడ్ బ్యాక్ తీసుకునే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండు బైపోల్స్లోనూ అభ్యర్థి విషయంలో చేసిన పొరపాటు ఈ సారి చేయకూడదనే పట్టుదలతో ఉంది గులాబీదళం. ఎమ్మెల్యేల మృతితో వచ్చిన ఎన్నికలు కావడంతో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్లో అనివార్యంగా వారి కుటుంబసభ్యులకే టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని..ఈ సారి గెలుపు గుర్రాన్నే ఎంపిక చేసుకునే అవకాశం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది.కేటీఆర్ ఇప్పటికే దానం నాగేందర్ అనర్హతపై స్పందిస్తూ.. ఖైరతాబాద్ ఉపఎన్నికలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలకూ ఇదే గతి పడుతుందన్నారు. దీంతో బీఆర్ఎస్కు ఖైరతాబాద్ బైపోల్ కేవలం మరో ఎన్నిక కాదనే చర్చ మొదలైంది. ఖైరతాబాద్లో గెలిచి అధికార పార్టీకి, జంపింగ్ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇవ్వాలని కసి మీదుందట బీఆర్ఎస్. అందుకే క్యాండిడేట్ సెలక్షన్స్ విషయంలో ఒక్క చిన్న తప్పిదం కూడా చేయకూడదని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు టాక్. ఖైరతాబాద్ బరిలో దిగే గులాబీ అభ్యర్థి ఎవరన్నది నోటిఫికేషన్ వస్తే తప్ప క్లారిటీ వచ్చేలా లేదు.

## మలక్ పేట్ లో పోలీస్ కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి




హైదరాబాద్ మలక్ పేట్ లో పోలీస కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి చెందాడు. మూసారాంబాగ్ శాలివాహన నగర్ లో ఘటన జరిగింది. కానిస్టేబుల్ ముత్తె చంద్రశేఖర్ (35) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. అంబర్పేట్ హెడ్ క్వా ర్టర్స్ లో కానిస్టేబుల్ రైటర్ విధులు నిర్వహిస్తు?న్నాడు. అర్ధరాత్రి ఓ యువతికి వీడియో కాల్ చేసినట్లు సమాచారం. తాను ఉరేసుకుంటున్నట్లు యువతికి చెప్పినట్లు సమాచారం. వెంటనే యువతి చైతన్యపురి పోలీసులకు సమాచారం అందించింది. చైతన్యపురి పోలీసుల సమాచారంతో మలక్ పేట్ పోలీసులకు విషయం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కానిస్టేబుల్ మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## సముద్రంలో మునిగిన బోటు



కోనసీమ జిల్లా భైరవపాలెం మొగలో మత్స్యకారుల బోటు మునిగిపోయింది. గ్రామానికి చెందిన చింత శ్రీను బోటుపై తొమ్మిది మంది మత్సకారులు వేటకు వెళ్లారు. గాలి వేగంగా వీయడంతో బోటు ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగిపోయింది. మరొక బోటు సహాయంతో మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు.

## బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో వీడియో కలకలం




హైదరాబాద్ బండ్లటూడ ఆర్టీవో కార్యాలయంలో ఒక వీడియో కలకలం రేపింది. ఆర్టీవో వా కార్యాలయంలో ముడుపుల భాగోతాన్ని బట్టబయలు చేసింది. భారీగా నగదు లెక్కిస్తున్న కానిస్టేబుల్ వీడియో వైరల్ అయింది. అన్ని డాక్యుమెంట్లు ఉన్న వాహనదారులను తిప్పుతున్న వైనం ఇక్కడ సాధారణమే. మధ్యవర్తుల ద్వారా వెళ్తేనే వేగంగా పనులు జరుగుతాయి. నగదు ఎవరిదని దానిపై సమాధానం రావడంలేదు. బాధితులే స్వయంగా వీడియోలు తీసి పోస్ట్ చేసినట్లు అనుమానం

## చంద్రాయన గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్

గణేష్ ఉత్సవాలు - 2026 నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చంద్రాయన గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.నగర పోలీస్ కమిషనర్ విసి, సజ్జనర్. మరియు రాజేంద్రనగర్ డీసీపీ, టి. శ్రీనివాస్. ఆదేశాల మేరకు చంద్రాయన గుట్ట ఏసిపి, ఏ, సుధాకర్. ఇన్స్పెక్టర్, రాచకొండ రవీందర్. డీఐ, రామస్వామి. సబ్ ఇన్ స్పెక్టర్లు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి మహబూబ్ నగర్ చౌరస్తా, కేశవ గిరి, బాలాపూర్ రోడ్, ఫూల్ బాగ్, సాయిబాబా నగర్, శివాజీ నగర్ ,పార్వతి నగర్, ప్రాంతాలలోని ప్రధాన రహదారులు, సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయనగుట్ట ఏసిపి, ఏ, సుధాకర్. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చంద్రయనగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. అలాగే గణేష్ మండప నిర్వహకులు పోలీసులకు సహకరించి, ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

## అన్నీ పార్టీలకు సవాలే...

హైదరాబాద్, సెప్టెంబర్ 21, దానం నాగేందర్పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి అనివార్యంగా మారే ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్కు కొత్త ఊపిరి పోస్తుందా లేక మరిన్ని రాజకీయ సమస్యల్లోకి నెడుతుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. పైకి చూస్తే అధికార కాంగ్రెస్పై పోరాడేందుకు ఇది ఒక సువర్ణావకాశంలా కనిపించినప్పటికీ, గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాలును విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉపఎన్నికలోనూ సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవన్న విషయం ఆ చేదు ఫలితంతో బీఆర్ఎస్కు స్పష్టంగా అర్థమైంది.ఖైరతాబాద్ క్షేత్రస్థాయి సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే ఇక్కడ సంస్థాగతంగా బీఆర్ఎస్ బలం దాదాపు శూన్యమనే చెప్పాలి. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది తప్ప, పార్టీకంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం బలంగా జరగలేదు. దానంకు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచరగణం, స్థానిక బస్తీల్లో ఆయనకున్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్లో సంప్రదాయబద్ధంగా ఉన్న పాత ఓటుబ్యాంకు, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ కేడర్, సరైన అభ్యర్థి లేని బీఆర్ఎస్కు దానం వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కొని నిలబడటం కత్తిమీద సామే అవుతుంది.ఒకవేళ ఈ ఉపఎన్నిక జరిగి, అధికార కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్ను నిలబెట్టి మళ్లీ గెలిపించుకుంటే.. అది బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకున్న పట్టు చేజారిపోయిందని, పార్టీ మారిన నేతను కూడా ఓడించలేకపోయామనే బలహీనమైన సంకేతం రాష్ట్రవ్యాప్తంగా వెళ్తుంది. ఇది జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ పార్టీ క్యాడర్ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి చేతిలో దెబ్బతిని నైతికంగా కుంగిపోవడం కంటే, ఇలాంటి ప్రతికూల సమయంలో ఉపఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి రాజకీయంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి.అందుకే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక అటు బీఆర్ఎస్కు మాత్రమే కాదు, ఇటు అధికార కాంగ్రెస్కు కూడా ఒక అన్వాంటెడ్ తలనొప్పి లాంటిదే.

అధికారంలో ఉండి ఒక్క ఉపఎన్నికలో కూడా తేడా రాకూడదనే ఒత్తిడి కాంగ్రెస్పై ఉంటే.. పరువు కాపాడుకోవాల్సిన డూ ఆర్ డై సిట్యువేషన్ బీఆర్ఎస్ను వెంటాడుతోంది. గెలిస్తే వచ్చే మైలేజీ కంటే, పొరపాటున ఓడిపోతే ఎదురయ్యే నష్టమే బీఆర్ఎస్కు పదిరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతే. అయినా ఉపఎన్నికను రెండు పార్టీలు ఎదుర్కోక తప్పదు.

## వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుకు ఫుల్ క్రేజీ

వరంగల్, సెప్టెంబర్ 21, తెలంగాణ కాంగ్రెస్లో ఏ పోస్టుకు లేనంత క్రేజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు ఉంటుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి.. ఒక లక్కీ పోస్ట్గా భావిస్తుంటారు నేతలు. ఎందుకంటే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పనిచేసిన లీడర్లు ఉన్నత స్థానాలకు ఎదుగుతారనే సెంటిమెంట్ ఉంది. ప్రస్తుతం మంచి పొజిషన్లో ఉన్న నేతలంతా కూడా తెలంగాణ ఏర్పడిన తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్గా పనిచేసినవారే. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ఇలా అందరూ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదట వర్కింగ్ ప్రెసిడెంట్గా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి తర్వాత పీసీసీ చీఫ్గా రికార్డ్ స్థాయిలో ఏడేళ్లు పని చేశారు. తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్గా పనిచేసిన భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్ అయ్యారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి చేపట్టి తర్వాత.. పీసీసీ చీఫ్.. ఆ తర్వాత సీఎం అయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ తర్వాత పీసీసీ చీఫ్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయనకు కూడా ప్రమోషన్ దక్కబోతుందని ప్రచారం నడుస్తోంది. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేసిన వారికి తర్వాత లక్కీ ఛాన్స్ ఉంటుందనే బలమైన నమ్మకం ఉండటంతో..ఆశావహుల జాబితా పెరిగిపోతోంది.ప్రపంచ పటాలు పరిశీలించండిముఖ్య నేతలు కూడా తమ వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నారట. అయితే, ఈ పోస్టుల నియామకం కోసం పెద్ద కసరత్తే జరుగుతోందట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు పోటీ పడుతున్న పలువురు పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారట. దీంతో దాదాపు రెండేళ్లుగా ఈ పదవుల నియామకం పెండింగ్లో పడుతూ వచ్చింది. అనేక రకాల చర్చల తర్వాత.. వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి పార్టీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ బలంగా వినిపిస్తుంది.ప్రస్తుతం ఇంచార్జ్గా ఉన్న మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్తున్నారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై ఆమె హైకమాండ్కు రిపోర్ట్ ఇచ్చేశారట. అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అధిష్టానం భావిస్తోందట. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎం రేవంత్ తన స్నేహితుడు రోహిణ్ రెడ్డి కోసం పట్టు బట్టడంతో.. ఇంచార్జ్ మీనాక్షి కూడా ఓకే చెప్పారట. మైనారిటీ వర్గం నుంచి సీఎం రేవంత్.. తన సన్నిహితుడు ఫహీం ఖురేషి పేరు ప్రతిపాదిస్తే ఇంచార్జ్ మీనాక్షి బ్రేక్ వేశారట. ఈ విషయంలో సీఎం కూడా వెనక్కి తగ్గారట. మైనారిటీ వర్గం నుంచి ఓబేదుల్లా కొత్వాల్ పేరు ఖరారైందట. ఎస్టీ వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్.. ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్ పేర్లను ఫిక్స్ చేశారని అంటున్నారు.వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు పెండింగ్లో ఉన్న ప్రచార కమిటీ, మిగిలిన జనరల్ సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేయబోతున్నారట. నామినేటెడ్ పోస్టులకు కూడా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చర్చించుకుంటున్నారు. ఈ నియామకాలన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని భావిస్తున్నారట పార్టీ పెద్దలు. ఈ సారైనా వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు గ్రహణం వీడుతుందో.? మళ్లీ ఏదైనా బ్రేకులు పడుతాయో.? చూడాలి మరి.

## మాజీ ఉప సభాపతి రఘుపతి అరెస్టు

బాపట్లవిజయవాడలో డీఎస్సీ అక్రమాలపై నిరసన తెలపడానికి వెళ్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ని పోలీసులు అరెస్ట్ చేసారు. డీఎస్సీ స్పోర్ట్స్ నియామకాల్లో అక్రమాల్ని ప్రశ్నిస్తూ శాప్ కార్యాలయం వద్ద ఈరోజు వైయస్ఆర్సీపీ భారీ నిరసనకి పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పాల్గొనడానికి వెళ్తున్న రఘుపతి ని బాపట్ల మండలం చుండూరుపల్లి వద్ద అరెస్టు చేసిన పోలీసులు, తరువాత బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్కి తరలించారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఆఖరి అస్త్రం..

# గులాబీ బాస్ కొత్తవ్యూహం ఏమిటి?

మెదక్, సెప్టెంబర్ 21, కేసీఆర్ సభకు వస్తారు. కానీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడుతారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాట ఇది. చిల్లర మాటలు మాట్లాడే వారి ముందుకొచ్చి తాను సభలో పాల్గొనాలా.? అంటూ గులాబీ బాస్ కూడా సభకు రాబోనని తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డిమాండ్లు చేసినా..ఎన్ని ఎత్తులు వేసినా..ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆఖరి అస్త్రాన్ని బయటికి తీశారన్న ప్రచారం నడుస్తోంది. ఎలాగైనా కేసీఆర్ నోరు తెరిపించాలి.. ఆయనతో వివరణ ఇప్పించాలనేదే రేవంత్ టార్గెట్ అని..అందుకోసం ఏ అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదంటున్నారు.ఆ మాట కొస్తే కొత్త కొత్త పొలిటికల్ వెపన్స్‌ను బయటికి తీస్తూ కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఫాంహౌస్ ల్యాండ్స్‌లో దళితుల భూమి ఉందంటూ ఏకంగా విచారణకు ఆదేశించారు. ఆల్రెడీ ఎంక్వైరీ జరుగుతోంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. అదంతా అడ్మినిస్ట్రేషన్ ప్రాసెస్ కాగా .. కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్ ఫాంహౌస్ పరిశీలనకు వెళ్లడం మరో రాజకీయ ఎత్తుగడ అన్న టాక్ నడుస్తోంది. ఎంపీలు వెళ్లి అక్కడ చేసేదేం లేదని..జస్ట్ మీడియాలో హైప్ కోసం..కేసీఆర్ ఆస్తులు సంపాదించారని ఎక్స్‌పోజ్ చేసే ఎజెండాలో భాగంగానే ఫాంహౌస్ పర్యటన పెట్టుకున్నారని అంటున్నారు.ప్రతీసారి వన్స్ మోర్ అంటూ కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ వస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదేళ్ల పాలనలో తెలంగాణకు బీఆర్ఎస్ ఏం చేసిందో..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఏం జరిగిందో..అసెంబ్లీలో ప్రజల ముందే చర్చిద్దామంటూ ఆ మధ్య సవాల్ చేశారు రేవంత్. చర్చలో తాను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతానని..కేసీఆర్ ఓడిపోతే ఫాంహౌస్‌కే పరిమితం అవుతారా అని ఛాలెంజ్ చేసిన సందర్భాలున్నాయి. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత కూడా తనదంటూ చెప్పుకొచ్చారు.ఇదంతా ఓ ఎత్తు అయితే..ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు..ఇంకోవైపు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ.. మరోవైపు కాళేశ్వరం దర్యాప్తు..ఇలా రకరకాల ఇష్యూస్‌తో కేసీఆర్ మౌనాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు సీఎం. అయినా నో కామెంట్ అంటూ సైలెంట్‌గా ఉంటూ వచ్చారు కేసీఆర్. ఫాంహౌస్‌లో నేతలతో భేటీ అయినా..పబ్లిక్ మీటింగ్‌లకు అటెండ్ అయినా..ఎక్కడా రేవంత్ పేరు తీయకుండానే ఈ ప్రభుత్వ పనితీరు బాలేదని..ప్రజలు సంతోషంగా లేరని చెప్పుకొంటూ వస్తున్నారు కేసీఆర్. దీంతో ఇన్నాళ్లు రేవంత్ వేసిన ఎత్తులేవి వర్కౌట్ కాలేదు. ప్రభుత్వం, సీఎం రేవంత్ చేసిన ఏ ఆరోపణపై కేసీఆర్ బయటికి వచ్చి రియాక్ట్ కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్ ఫైనల్ పంచ్ ఇచ్చేందుకు ఫాంహౌస్ ల్యాండ్స్ చుట్టూ ఎంక్వైరీ అంటూ రచ్చకు తెరలేపారని అంటున్నారు.అధికార పార్టీ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా..రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు కేసీఆర్ను ఉద్దేశించి పర్సనల్ అటాక్ చేసినా..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేసినా..గులాబీ బాస్ రియాక్ట్ అయిన దాఖలాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా ప్రస్తావించకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అలిగేషన్స్‌కు సమాధానం చెప్పే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులే తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి తామే సరిపోతామ్..కేసీఆర్ స్పందించాల్సిన అవసరం లేదని వాళ్లిద్దరే రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు.కానీ రేవంత్ టార్గెట్ ఒక్కటే. కేసీఆర్ నోరు తెరిపించాలి. తన పేరు ప్రస్తావించి మాట్లాడే పరిస్థితి తీసుకురావాలి. అన్నింటికి మించి రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగానే తెలంగాణ పొలిటికల్ సినారియోలో డైలాగ్ వార్ కొనసాగాలనేది రేవంత్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. అందుకే సందర్భం దొరికిన ప్రతీసారి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు కేసీఆర్ రంగంలోకి దిగాలని..అదే తమ ఎన్నికల అస్త్రమని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే జరిగితే ఎన్నికల్లో కేసీఆర్‌కు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుందని.. ఆలోపే కేసీఆర్ నోరు తెరిపించాలని రేవంత్ ప్లాన్ అని అంటున్నారు. దీంతో ఈ ఇద్దరి పోరాటం.. రసవత్తరంగా మారుతోంది.మరి ఈ సారి రేవంత్ వేసిన ల్యాండ్ ఎంక్వైరీపై కేసీఆర్ స్పందిస్తారా.? రేవంత్ ఫైనల్ పంచ్‌కు కేసీఆర్ మౌనం వీడుతారా.? ఇప్పటివరకు అనుసరిస్తున్న వ్యూహాన్నే కొనసాగిస్తారా.? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. ఒకవేళ కేసీఆర్ స్పందిస్తే..కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య రాజకీయ సమరం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. స్పందించకపోతే..బ్లేమ్ గేమ్ వెపన్‌గా మలుచుకునేందుకు హస్తం పార్టీ రెడీ అవుతోంది. రేవంత్ లేవనెత్తిన ఈ ల్యాండ్ లడాయి ఎటు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

## జూరాల వద్ద హైటెన్షన్.. భారీగా పోలీసుల మోహరింపు





మహబూబ్ నగర్ సోమవారం నాడు జూరాల ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో భారీగా పోలీసులు మోహరించారు. రైతుల ఆందోళనలకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో 12 కిలోమీటర్ల పరిధిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సాగునీటి సమస్యలపై గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం అరెస్ట్ చేయిస్తోందని పార్టీ ఆరోపించింది. జూరాల నుంచి నీళ్లు ఇవ్వడం లేదంటూ ధర్నాకు రైతులు సిద్ధమయ్యారు. దీంతో ప్రాజెక్టుకు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

# గురజాడ అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన సిఎస్

అమరావతి,సెప్టెంబరు 21: నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం ఎపి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్,సియం కార్యదర్శి ఎవి రాజమౌళి గురజాడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.ఈసందర్భంగా సిఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ మహాకవి మరియు నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళడంలో ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబించే రీతిలో గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కం నాటకానిది ఒక ప్రత్యేకతని పేర్కొన్నారు.అనేక రచనల ద్వారా ఆనాటి సమాజంలో సాంఘిక పరివర్తనను తీసుకువచ్చేందుకు ఎనలేని కృషి చేశారని సిఎస్ ఈసందర్భంగా గుర్తు చేశారు.

ఈకార్యక్రమంలో సియం కార్యదర్శి ఎవి రాజమౌళి గురజాడ అపారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.అదే విధంగా ప్రొటోకాల్ విభాగం సంయుక్త కార్యదర్శి రామసుబ్బయ్య,రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ,ఇతర అధికారులు,ఉద్యోగులు గురజాడ చిత్రపటానికి పుష్పాంజల ఘటించి నివాళులు అర్పించారు.గురజాడ అప్పారావు విశాఖ జిల్లా యస్.రాయవరంలో 1862 సెప్టెంబరు 21న వెంకట రామదాసు,కౌసల్యమ్మ దంపతులకు జన్మించారు.గురజాడ 19వ శతాబ్దంలోను,20 వ శతాబ్ది మొదటి దశకంలోనూ చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయి.అతను ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేసారు.కన్యాశుల్కము నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది.అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావు తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు.గురజాడ కుటుంబం వారి తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి వలస వెళ్ళింది.అప్పారావు తండ్రి విజయనగరం సంస్థానంలో పేష్కరుగా, రెవెన్యూ సూపర్వైజరుగా, ఖిలేదారు గానూ పని చేసాడు.తన 10వ ఏట వరకు అప్పారావు చీపురుపల్లిలో చదువగా వారి తండ్రి కాలం చెయ్యటంతో విజయనగరానికి వచ్చారు.అక్కడ చాలా పేదరికంలో వారాలు చేసుకుంటూ చదువు కొనసాగించాడు.ఆ సమయంలో అప్పటి ఎమ్.ఆర్.కళాశాల ప్రధానాధ్యాపకులు సి.చంద్రశేఖర శాస్త్రి అప్పారావును చేరదీసి ఉండడానికి చోటిచ్చాడు. 1882లో మెట్రిక్యులేషను పూర్తిచేసి 1884లో ఎఫ్.ఎ చేసి అదే సంవత్సరంలో ఏం.ఆర్. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరాడు .విజయనగరంలో బి.ఏ చదువుతున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి అతనుకు సహాధ్యాయి వారిద్దరూ ప్రాణస్నేహితులు.గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించాడు.ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుక భాషలో రచించాడు.ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యాశుల్కం,వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. 1892లో నాటకపు తొలి ప్రదర్శన జరిగింది. 1910లో రాసిన దేశమును ప్రేమించుమన్నా అనే దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందింది. గురజాడ అప్పారావు రచనల్లో పూర్ణమ్మనీలగిరి పాటలు,ముత్యాల సరాలు, సత్యవ్రతి శతకం, సుభద్ర, లంగరెత్తుము,కాసులు,దిద్దుబాటు వంటివి కొన్ని ముఖ్యమైన రచనలు.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, ఎల్. మురుగన్ కుటుంబాలతో దర్శించుకున్నారు.దేశాభివృద్ధి, మంచి వర్షాలు, ప్రధాని నరేంద్ర మోదీ క్షేమంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు.స్వామివారి దర్శనం కోసం వచ్చిన కేంధ్ర మంత్రులకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.దర్శనం అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు.

# వైకాపావి చెత్త ఆరోపణలు

# మంత్రి నారాయణ

నెల్లూరు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు తనపై చేసేవి చెత్త ఆరోపణలని ధ్వజమెత్తారు. నెల్లూరు జిల్లాలోని దొంతాలి లెగసీ వేస్ట్ ప్లాంటును మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 153 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌లో ఇప్పటికే 143 లక్షల టన్నుల చెత్తను తొలగించామని,మిగిలిన చెత్తను కూడా త్వరితగతిన క్లియర్ చేస్తామని,రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల పనులు కొనసాగుతున్నాయి. మరో ఆరు చిజీబబివ–బినీ–ఇనివతీణఎ ప్లాంట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి అనుమతించారని,దొంతాళి ప్లాంట్ పూర్తయితే 100 కి.మీ. పరిధిలోని చెత్తను రోజువారీగా ప్రాసెస్ చేసి విద్యుత్‌గా మారుస్తామని,చెత్తను సమస్యగా కాకుండా వనరుగా మార్చి.. ప్రజారోగ్యానికి భరోసా కల్పించే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం అని తెలిపారు. చెత్తని కాలుస్తున్నారని వైసీపీ నేతలు అవివేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చదువుకున్న వారు కూడా అజ్ఞానంతో మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. చెత్తకుప్పలో బయోగ్యాస్ తయారై మంటలు వస్తాయని తెలిపారు. మిథైన్ 65 శాతం ఉండటంతో ఈ చెత్త తగలపడుతోందని చెప్పుకొచ్చారు.

## పోరుమామిళ్ల: టేకు మొద్దుల వ్యవహారం..

## విచారణకు డీఎఫ్ వో ఆదేశం



కడప జిల్లా... పోరుమామిళ్లలో టేకు మొద్దుల ట్రాక్టర్లను నామమాత్రపు జరిమానాతో వదిలేసిన ఘటనపై జిల్లా ఫారెస్ట్ అధికారి (ఆఈూ) స్పందించారు. దీనిపై విచారణ జరపాలని ప్రొద్దుటూరు సబ్–డీఎఫ్ వోను ఆదేశించారు. విచారణ నివేదిక అందిన వెంటనే బాధ్యులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సమస్యలు తమ దృష్టికి వస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

# స్వరాంధ్ర స్వచ్చాంధ్ర లో పాల్గోన్న కేంద్ర మంత్రి

శ్రీకాకుళం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వరాంధ్ర స్వచ్చాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.నాడు శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కళాశాలలో నిర్వహించారు.కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి.. అపరిశుభ్ర వాతావరణం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించాల్సిన విద్యార్థినిలు.. ఇలాంటి వాతావరణంలో ఉండటం సరైన పద్ధతి కాదని ఓ వైపు కళాశాల సిబ్బందిని హెచ్చరిస్తూనే.. మున్సిపల్ అధికారులకు, జిల్లా యంత్రాంగానికి పరిశుభ్రతకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

# రెడ్ సర్కిల్ వద్ద భారీగా పోలీసులు మొహరింపు

విజయవాడ డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అవకతవకల్ని ప్రశ్నిస్తూ.. సోమవారం శాప్ కార్యాలయం వద్ద నిరసనకి వైయస్ఆర్సీపీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో భారీగా విజయవాడకి వైయస్ఆర్సీపీ శ్రేణులు చేరుకోవడంతో.. పోలీసులు బారికేడ్లు పెట్టి వాహనాల్ని నిలిపివేస్తున్నారు. ఎవరూ శాప్ ఆఫీస్ దగ్గరికి వెళ్లకుండా అడ్డగించారు.

# జిల్లా ప్రజలు అప్రమత్తంగా వుండాలి కలెక్టర్

శ్రీకాకుళం జిల్లాపై వాతావరణ ప్రభావం మరింత పెరగనుంది. రాబోయే నాలుగు రోజులు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతున్న నేపథ్యంలో ఈ నెల 21 నుంచి జిల్లాలో వర్షాలు మొదలయ్యే అవకాశం ఉందని.. 22, 23 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ వాతావరణ పరిస్థితులపై వివరాలు వెల్లడించారు. ప్రస్తుత వ్యవస్థ తీవ్ర వాయుగుండంగా మారి 23, 24 తేదీల్లో తుఫాన్‌గా ఉత్తరాంధ్ర వైపు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని యంత్రాంగం అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# ఒంగోలు మేగా సెగ్రిగేషన్ డ్రైవ్ కు విశేష స్పందన

ఒంగోలు మునిసిపాలిటీ 150 వసంతాల వేడుకలలో భాగంగా వరల్డ్ రికార్డు సాధనే లక్ష్యంగా చేపట్టిన మెగా సెగ్రిగేషన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది.నగరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతోపాటు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సంద ర్భంగా కార్పొరేషన్ స్పెషలాఫీసర్ అయిన కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మన ఒంగోలు–మన గౌరవం నినాదంతో ఈనెల 28, 29, 30 తేదీలలో మునిసిపాలిటీ 150 ఏళ్ల వేడుకలను అత్యంత వైభవంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహిస్తామని తెలిపారు. వేడుకలలో భాగంగా పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలోని 81వేల గృహాల నుంచి ఒక గంట సమయంలోనే తడి, పొడి చెత్తను సేకరించామన్నారు. ఈ డ్రైవ్‌లో ఐదుగురు జిల్లా అధికారులు పర్యవేక్షకులుగా.. వారికి సహాయకులుగా మునిసిపల్ డీఈ, ఏఈ, సచివాలయ సెక్రటరీలు, బీఎల్‌వోలు, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్మికులు సుమారుగా 2,500పైగా పాల్గొన్నారని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడం, వరల్డ్ రికార్డు సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు

# గార్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి విపత్తు నిర్వహణ నిధులు మంజూరు చేయాలి




గార్ల: ఎల్ నీనో ప్రభావంతో గార్ల ఏజెన్సీ మండలంలో పంటలు పండని పరిస్థితి ఉందని వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వెంటనే విపత్తు నిర్వహణ నిధులు మంజూరు చేయాలని అఖిఓ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్,మండల కార్యదర్శి అలవాల సత్యవతిలు డిమాండ్ చేశారు. మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని అఖిఓ ఆధ్వర్యంలో ఓఖఆూ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి,గ్రీవెన్స్ లో అధికారులకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 20 వేల రూ,ల చొప్పున పరిహారాన్ని చెల్లించి,రైతుల పంట రుణాలను రీ-షెడ్యూలు చేసి,తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని,పశువులకు మేత,తాగునీరు కొరత కాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని,వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఉపాధి హామీ పథకం కింద అదనపు పని దినాలు కల్పించి,వ్య.కా,స కూలీలకు ఇస్తామన్న 12వేల రూ,లు ఇవ్వలన్నారు

## బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య
## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ జూరాల ఆయకట్టుకు సాగునీరిచ్చి పంటలు కాపాడాలని రైతుల పక్షాన డిమాండ్ చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు.


మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ పార్టీ నేతలందరినీ అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనం. కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సింది పోయి, న్యాయమైన డిమాండ్తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని అన్నారు.

సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే, జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చాడు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా, నీళ్లను విడుదల చేయకుండా పనికిరాని కుంటిసాకులతో రేవంత్ సర్కారు పచ్చని పంటల ఉసురు తీస్తోంది. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే, వారిపై అక్రమ కేసులు బనాయించిన ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా అరిగోస పెడుతోంది. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి, వందలాది పోలీసులను చుట్టుపక్కల మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య. తాగునీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా, 9 టీఎంసీలున్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపమని అన్నారు.

అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు జూరాల ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయమని అన్నారు.

# సంజీవ్ గాంధీ నగర్‌లో పెద్ద ఎత్తున మహా అన్నప్రసాద వితరణ

## 26 ఏళ్లుగా అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21 స్థానికనియోజకవర్గంలోని సంజీవ్ గాంధీ నగర్‌లో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు, అసోసియేషన్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. గత 26 సంవత్సరాలుగా శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతిరోజూ వినాయక స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష్మీదేవి పూజ, సుబ్రహ్మణ్య స్వామి, హనుమాన్ అభిషేకాలు, హోమాలు, శివునికి రుద్రాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు, భక్తులు పూజా నియమాలను పాటిస్తూ నియమ నిష్ఠతో స్వామివారి సేవలో పాల్గొంటున్నారని వెల్లడించారు.వినాయక స్వామివారి కృపతో కాలనీ వాసులందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# ఎంపీ డీకే అరుణను అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

మహబూబ్ నగర్ బీజేపీ ఎంపి డికె ఆరుణను బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. కోయిల్సాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మరికల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆదే సమయంలో అయితే మహబూబ్నగర్ నుంచి మక్తల్ వైపు వెళ్తున్న బీజేపీ ఎంపీ డీకే అరుణను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. సాగునీరు అందక పంటలు పొట్ట దశలో ఎండిపోయే పరిస్థితి ఉందని దృష్టిలో ఉంచుకుని కోయిల్సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని డీకే అరుణ ఎదుట నిరసనకు దిగారు.

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే
## కావలి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ప్రత్యేక చర్చ



కావలి, సెప్టెంబర్ 21 ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి జిల్లా పర్యటనలో భాగంగా కావలికి విచ్చేసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు అనంతరం శాలువాకప్పి పూల బొకేతో సత్కరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న మంత్రి, మార్గమధ్యంలో కావలిలోని ఎమ్మెల్యే నివాసానికి విచ్చేశారు.ఈ సందర్భంగా కావలి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు తీరుపై మంత్రితో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలను మంత్రికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బోర్ రిపేర్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
## గోపవరం ఎంపిడిఓ కార్యాలయం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

గోపవరం, సెప్టెంబర్ 21 స్థానిక మండల పరిధిలోని చిన్న గోపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు తాగటానికి నీళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, పాఠశాలలో చెడిపోయిన బోరును వెంటనే రిపేరు చేయించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్ డిమాండ్ చేశారు.సోమవారం ఉదయం గోపవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం ఎంపీడీవో కు వినతి పత్రంసమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపవరం మండలంలోని చిన్న గోపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోరు చెడిపోయి 20 రోజులు




కావస్తున్నదని, దీంతో విద్యార్థులు తాగటానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఈ విషయంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారికి రాతపూర్వకంగా తెలియజేస్తూ, బోర్ ను తక్షణమే రిపేరు చేయించాలని కోరినప్పటికీ అధికారులు స్పందించ లేదన్నారు.బోరును మరమ్మత్తు చేయించడం పెద్ద ఖర్చుతో కూడుకున్నది కాకపోయినప్పటికీ అధికారులు అలసత్వం వహించడం తగదన్నారు. అధికారుల వైఖరి వల్ల ప్రాథమిక స్థాయి విద్యార్థులు తాగటానికి నీళ్లు లేక భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి బోర్ రిపేర్ చేపించి విద్యార్థులకు తాగునీటి వసతిని కల్పించాలని వారు కోరారు. దీంతోపాటు పి.పి కుంట లోని పాఠశాలలో కూడా తాగు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని వారు తెలిపారు. అధికారులు తక్షణం స్పందించి నీటి సమస్యను పరిష్కరించకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మహిళా కన్వీనర్ ఎస్కే ఫాతిమా పట్టణ ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి సుధాకర్ నాయకులు విజయ్, నిహార్, హర్షిత్, సన్నీ, యూనస్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత:
## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21 కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అనంతరం వారు మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నిమజ్జన శోభాయాత్రను భక్తి శ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయసంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని యువతకు,అసోసియేషన్ సభ్యులకు సూచించారు. వివిధ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఫేక్ అంటూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం
## కుప్పం సభలో సీఎం చంద్రబాబు నాయుడు

కుప్పం డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఫేక్ అంటూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది. వాళ్ల హయాంలో కూడా క్రీడలు నిర్వహించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం కుప్పంలో జరిగిన సభలో అయన మాట్లాడుతూ .వారికి సర్టిఫికేట్లు ఇచ్చారు..అవి వాళ్లు ఇచ్చిన సర్టిఫికేట్లు కూడా ఇప్పుడు ఫేక్ అంటున్నారు గొడ్డలి పార్టీ అధినేత ఫేక్ అని అందర్నీ ఫేక్ అనడం ఇదెక్కడి న్యాయం. విజయవాడలో గురువులపై గొడ్డలిపార్టీ రౌడీలు దాడి చేశారు. వాళ్ల సర్టిఫికేట్లు దాడి చేశారు. ఆర్మీలో పనిచేసిన సైనికుడికి కుప్పంలో ఉద్యోగం వస్తే స్కూలు నుంచి బయటకు పిలిచి సాక్షి రిపోర్టర్ అవమానించారని అన్నారు.

### ఏపీలో అక్టోబర్ 12 నుంచిస్కూళ్లకు దసరా సెలవులు

అమరావతి : ఏపీలోని పాఠశాలలకు అక్టోబర్ 12 నుంచి 21 వరకు దసరా సెలవులు ప్రకటించారు. అయితే, రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. క్రిస్టియన్ ఎయిడెడ్ పాఠశాలలకు క్రిస్మస్ సెలవుల కారణంగా షెడ్యూల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. తెలంగాణలో అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు.

# అక్టోబర్ 4న రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు



వికారాబాద్ సెప్టెంబర్ 21: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వికారాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలను అక్టోబర్ 4న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి జి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో వారు నామినేషన్ల స్వీకరణ సెప్టెంబర్ 24వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు స్వీకరించబడునని, నామినేషన్ల పరిశీలన 25వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఒక గంట వరకు నిర్వహించబడును అని, నామినేషన్లు ఉపసంహరణ గడువు 26వ తేదీ మూడు గంటల వరకు ఉంటుందని, అదే రోజు మూడు గంటలు అనంతరం తుది పోటీ దార్ల జాబితాను జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆఫీసు యందు ప్రచురించటం జరుగుతుందని ఎన్నికల అధికారి జి శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన అవసరమైతే పోలింగ్ ను బస్టాండ్ సమీపాన గల విశ్వ భారతి డిగ్రీ కళాశాల యశీదు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఓట్ల లెక్కింపు మూడు గంటల అనంతరం నిర్వహిస్తామని ఎన్నికల అధికారి జి శ్రీనివాస్ తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని ఎన్నికల అధికారి జి శ్రీనివాస్ తెలిపారు

# కుబ్జిగూడ శ్రీ కృష్ణ అసోసియేషన్ ఆద్వర్యం లో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 21: కాచిగూడ కుబ్జిగూడ లో శ్రీ కృష్ణ అసోసియేషన్ ఆద్వర్యం లో 23 వ గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.సోమవారం ఉదయం గణపతి హోమం నిత్య పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సారి కుబ్జిగూడ లో నంది పై గణపతి అధిరోహించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ యాదవ్ ,ఉమాకాంత్ ,వినోద్ , బాల్తేజ్ ,తదితరులు పాల్గొన్నారు..

# వేటుకు గురై ఉపఎన్నికల బరిలో నిలుస్తే ఎన్నికల ఖర్చును రాబట్టాలి

## జాతీయ ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి
## పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టంను బలోపేతం చేయాలి
## లోక్ సత్తా డిమాండ్


**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 21: ఖైరతాబాద్ మీూా దానం నాగేందర్ పై రాష్ట్ర హైకోర్టు వేసిన అనర్హత వేటు ఆహ్వానించదగిన తీర్పు అని తీర్పు ఒక్కటే




సరిపోదని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. ఈ రోజు రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ పై విధంగా అన్నారు. అంతే గాకుండా భవిష్యత్తు ఎన్నికలలో కొంతకాలం పాటు పాల్గొనకుండా జాతీయ ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ వచ్చే నియోజక వర్గ ఉపఎన్నికలలో వేటుకు గురైన తను అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటే ఎన్నికల ఖర్చు అతని వద్ద నుండి రాబట్టేలా చర్యలు తీసుకోవాలి అని ఎన్నికల సంఘము ను ఆయన సూచించారు. పార్టీ ఫిరాయించడం ప్రజలను,చట్ట సభలను అగౌర పరచడమే అవుతుందని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రజా ప్రతినిధులు తగిన మూల్యం చెల్లించ వలసిందేనని నని పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టం మరింత కఠిన తరం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించాలని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తీగలపల్లి రంగా చారి, కొప్పుల శ్రీధర్, ప్రముఖ న్యాయవాది నాగుల శ్రీనివాస్ యాదవ్, కుందేటి రవి ,కేసరి వెంకట నర్సింగ్ రావు, శేరిపల్లి నర్సింగ్ రావు, రత్నం సుదర్శన్ నేత తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్న మీర్ ఉస్మాన్ రేవంత్ ఉద్దీన్ ఖాన్

## 9వ నిజాం తరహా ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం
## వినాయకుడికే విఘ్నాలు కలిగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
## తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు
## -- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**
హైదరాబాద్,సెప్టెంబర్ 21:హిందువుల అతి పెద్ద పండుగ అయిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమంలో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ విశ్వకర్మ యోజన కన్వీనర్ తెలంగాణ రాష్ట్రం. తెలంగాణ రాష్ట్ర విమోచన కమిటీ చైర్మన్.డా. బూర నర్సయ్య గౌడ్ అన్నారు.

విఘ్నేశ్వరుడిగా కొలిచే వినాయకుడికే విఘ్నాలు కలిగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని ఆయన హెచ్చరించారు. వినాయకుడి నిమజ్జనానికి అడ్డంకులు సృష్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు.

ఇప్పటికైనా ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కనపెట్టి రాజధర్మాన్ని పాటించాలని, రాజ్యాంగబద్ధంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు భక్తులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని డా. బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

వినాయక మండపాల వద్ద, విగ్రహాల సమీపంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో ఆవుల మాంసం పడేసి అల్లకల్లోలం సృష్టిస్తున్న అల్లరి మూకలను చట్టపరంగా కట్టడి చేయాలని ఆయన కోరారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాలని, ముఖ్యమంత్రి పదవికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

హిందువుల విశ్వాసాలను, ఆచారాలను, పండుగలను ప్రభుత్వం గౌరవించాలని, గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని డా. బూర నర్సయ్య గౌడ్ కోరారు.అధికారం అనేది శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసాలను, హిందువుల మనోభావాలను గౌరవించకుండా ఇదే విధంగా వ్యవహరిస్తే చారిత్రహీనులుగా మిగిలిపోతారని కాంగ్రెస్ ప్రభుత్వానికి హితవు పలికారు.

# గణేష్ నిమజ్జనానికి రోడ్లపై గుంతలు పూడ్చుచున్న ట్రాఫిక్ పోలీస్ మున్సిపల్ సిబ్బంది.






**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 21: గణేష్ నిమజ్జనానికి సిటీ ట్రాఫిక్ పోలీస్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తమవంతు సహకారం అందిస్తున్నారు..అప్రమత్తం గా ఉంటూ నిమజ్జనానికి వెళ్లే వాహనాల వల్ల రోడ్డుపై వెళ్ళే వాహనాల వల్ల ఏర్పడే గుంతలను ఎప్పటి కప్పుడు డాంబర్ తో పూడుస్తున్నారు.. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా వాహనాలు సాఫీగా ముందుకు వెళ్లేందుకు టీం వర్క్ చేస్తున్నారు... కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కౌశిక్ ఆధ్వర్యం లో GHMC వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్ మూర్తి సిబ్బంది సహకారంతో నింబోలి అడ్డ అండ్ కాచిగూడ ప్రాంతం లో రోడ్స్ పై అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకొన్నారు..గణేష్ నిమజ్జన ఉత్సవాలు విజయ వంతం గా జరిగేందుకు తమవంతు సహకారం అందిస్తున్నందుకు ఎంతో సంతోషం గా ఉందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కౌశిక్ , కార్పొరేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ నవీన్ మూర్తి అన్నారు...కాచిగూడ ట్రాఫిక్ మొబైల్ 1 నారాయణ రెడ్డి..మొబైల్ 2 శ్రీనివాస్ సహకరించారు

# వరంగల్ డొమెస్టిక్ ఎయిర్పోర్టుకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలి

## గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల శ్రీహరి

వరంగల్ సెప్టెంబర్ 21:వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన డొమెస్టిక్ ఎయిర్పోర్టుకు భారత మాజీ ప్రధానమంత్రి,



తెలంగాణ బిడ్డ శ్రీ పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ నరసింహారావు) గారి పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాను.

దేశం అత్యంత కీలకమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పీవీ నరసింహారావు గారు, భారతదేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దేశాన్ని ఆర్థికంగా కొత్త దిశలో నడిపించడంలో ఆయన పాత్రచారిత్రాత్మకమైనది

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో విదేశాంగ, హోం, రక్షణ, మానవ వనరుల అభివృద్ధి వంటి కీలక శాఖలకు మంత్రిగా, అనంతరం భారత ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పరిపాలన, ఆర్థిక వ్యవస్థ, విద్య, విదేశాంగం తదితర రంగాల్లో ఆయన చూపిన దూరదృష్టి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

తెలంగాణ నేల నుంచి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన పీవీ నరసింహారావు సేవలకు గుర్తింపుగా వరంగల్ డొమెస్టిక్ ఎయిర్పోర్టుకు "శ్రీ పీవీ నరసింహారావు డొమెస్టిక్ ఎయిర్పోర్ట్" అని పేరు పెట్టడం సముచితమైన గౌరవం.

వరంగల్ ప్రాంత అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో కీలకం. పారిశ్రామిక అభివృద్ధి, వాణిజ్యం, విద్య, వైద్యం, పర్యాటకం, ఉపాధి అవకాశాలకు ఇది మరింత ఊతమివ్వగలదు. అలాంటి ప్రతిష్ఠాత్మక విమానాశ్రయానికి తెలంగాణ గర్వకారణమైన మహానేత పీవీ నరసింహారావు గారి పేరు పెట్టడం ద్వారా ఆయన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తు చేసినట్లవుతుంది.

పీవీ నరసింహారావు గారు తెలంగాణ ప్రాంతానికి, భారతదేశానికి అందించిన అపారమైన సేవలను స్మరించుకుంటూ, వరంగల్ డొమెస్టిక్ ఎయిర్పోర్టుకు ఆయన పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మరియు సంబంధిత ప్రజాప్రతినిధులను కోరుతున్నాను.

# శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు స్పాట్ డెడ్

శ్రీశైలం సోమవారం ఉదయం శ్రీశైలం ఘాట్ రెడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆక్టోపస్ వ్యూ పాయింట్ వద్ద ఎదురుగా వస్తున్న బుల్లెట్ బైక్ను క్రూజర్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యూపీకి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పలువురికి గాయాల్యాయి. గాయాలపాలైన వారిని అచ్చంపేట ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# పోషకాహారంతోనే చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తు

## 10 వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత - శ్రీకాంత్




**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి (సెప్టెంబర్ -21):** చిన్నారులు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత శ్రీకాంత్ అన్నారు. పోషణ మాసం సందర్భంగా సోమవారం వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐసిడిఎస్, సీడీపీఓ సౌందర్య, సూపర్వైజర్ అంజమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ నిర్వహణ కమిటీ (ఏఎంసీ అంగన్వాడీ మేనేజ్మెంట్)ని ఏడు గురి సభ్యులతో ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ సిరిగిరి సంగీత శ్రీకాంత్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది అని అన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సమతుల్యమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గర్భిణీలు, బాలింతలు కూడా తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా "పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడటం మనందరి బాధ్యత. అంగన్వాడీ కేంద్రాలు కేవలం పిల్లలకు ఆహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా, వారి ఆరోగ్యం, ఎదుగుదల, విద్యకు బలమైన పునాదులు వేస్తున్న కేంద్రాలు. తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని మరింత సమర్థవంతంగా నివారించవచ్చు" అని అన్నారు. పోషణ మాసం సందర్భంగా ప్రజల్లో పోషకాహారంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు తదితర పోషక విలువలున్న ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీడీపీఓ సౌందర్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను వివరించారు. సూపర్వైజర్ అంజమ్మ అంగన్వాడీ నిర్వహణ కమిటీ బాధ్యతలు, కేంద్రం నిర్వహణలో కమిటీ సభ్యుల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్, పాఠశాల ఉపాధ్యాయురాలు సుచరిత, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ప్రీ-స్కూల్ పిల్లల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ముప్పు ముంచుకొస్తోంది

## (హెచ్. ప్రతాప్)

తెలంగాణకు ఈసారి వర్షాకాలం గట్టి హెచ్చరికనే ఇచ్చింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం, జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు, భూగర్భ జలమట్టాల పతనం కలిసి రాబోయే నెలల్లో తాగునీటి సరఫరాపై ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇది కేవలం సాగునీటి సమస్యగా చూడాల్సిన అంశం కాదు. నగరాలు, పట్టణాలు, గ్రామాల తాగునీటి భద్రతతో ముడిపడిన అత్యంత కీలక సవాలు.

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 20 వరకు తెలంగాణలో 554.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ కాలంలో 688.1 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా, దాదాపు 19 శాతం లోటు నమోదైంది. ఈ వర్షాభావ ప్రభావం జలాశయాల నిల్వలపై స్పష్టంగా కనిపిస్తోంది.

కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టుల్లో జీవజల నిల్వలు సుమారు 160 టీఎంసీలకు పడిపోయినట్లు సమాచారం. గత ఏడాది ఇదే సమయంలో అవి దాదాపు 333 టీఎంసీలు ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మెదక్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లోని కొన్ని జలాశయాలు కనిష్ఠ నిల్వలకు చేరువవుతుండటం హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలపై కూడా అప్రమత్తత అవసరమని సూచిస్తోంది.

ఇక భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది ఆగస్టులో సగటున భూమికి 5.78 మీటర్ల దిగువన ఉన్న నీటిమట్టం ఈసారి 7.87 మీటర్లకు దిగజారినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంటే వర్షాభావ ప్రభావం ఉపరితల జలాలకే పరిమితం కాకుండా భూగర్భ జలవనరులపైనా పడుతోంది.

అయితే పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఇంకా ఉంది. రాబోయే వర్షాలను గరిష్ఠంగా ఒడిసిపట్టడం, చెరువులు--కుంటలను అనుసంధానించడం, లీకేజీలను తగ్గించడం, పట్టణాల్లో వర్షపు నీటి సంరక్షణను విస్తరించడం, పరిశ్రమల్లో శుద్ధిచేసిన నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం. గ్రామస్థాయిలో బోర్ల వినియోగాన్ని శాస్త్రీయంగా పర్యవేక్షించాలి.

తాగునీరు అందరికీ ప్రథమ ప్రాధాన్యం కావాలి. ఇప్పుడు నుంచే ప్రతి చుక్కను పొదుపుగా వినియోగిస్తే వేసవిని సంక్షోభంగా కాకుండా సమర్థ నిర్వహణకు పరీక్షగా మార్చుకోవచ్చు. నీరు ఉన్నప్పుడే దాని విలువను గుర్తిస్తేనే, నీరు లేని రోజులను నివారించగలం.

## బిసి భవన్ లో కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



హైదరాబాద్, సెప్టెంబర్ 21: మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన తెలంగాణవాది, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా విద్యానగసర్ లోని బిసి భవన్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాములు,బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామానుజ నేలు, పద్మశాలి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మహేశుని లక్ష్మయ్య నేత,నిఖిల్ పటేల్ తదితరులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాములు మాట్లాడుతూ తెలంగాణ కోసం తన స్వగృహమైన జలదృశ్యాన్ని సైతం ఉద్యమానికి అంకితం చేసిన బాపూజీ త్యాగం, దూరదృష్టికి నిదర్శనమన్నారు. సబ్బండ వర్గాలు ఆత్మగౌరవంతో, సమాన అవకాశాలతో జీవించాలన్నదే కొండా లక్ష్మణ్ బాపూజీ ఆకాంక్ష అని అన్నారు.ఆయన స్ఫూర్థి అన్నివర్గాల ఆదర్శమన్నారు.

# ఆఘాజ్-ఎ-విరాసా'లో ఆభరణాల ప్రదర్శన

హైదరాబాద్ సాంస్కృతిక, రాజవం శ సంప్రదాయాల స్ఫూర్తితో రూపొందించిన హెరిటేజ్ జ్యువెలరీ హౌస్ 'విరాసా' ఘనంగా ప్రారంభమైంది. 'ఆఘాజ్-ఏ-విరాసా' పేరుతో ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ హోటల్, గ్రీనా వ్యాలీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మహమూద్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై బ్రాండ్ను ఆవిష్కరించారు. సంప్రదాయ ఆభరణాల కళాత్మకతను ఆధునిక డిజైన్ సౌందర్యంతో మేళవిస్తూ అమ్తుల్ సిద్దిఖీ విరాసాను స్థాపించారు. ఆభరణం కేవలం అలంకరణ మాత్రమే కాకుండా జ్ఞాపకాలు, వ్యక్తిత్వం, కుటుంబ వారసత్వాన్ని తరతరాలకు అందించే గుర్తుగా ఉండాలన్నదే విరాసా లక్ష్యమని అముల్ సిద్దిఖీ తెలిపారు. 'ఆఘాజ్-ఎ-విరాసా ప్రదర్శనలో భారతీయ వారసత్వం, రాజవంశ సంప్రదాయాల నుంచి స్ఫూర్తి పొందిన ఆభరణాలను ప్రదర్శించారు.

# వినాయక మండపాలలో డాక్టర్ మట్టా దయానంద్ పూజలు.

**మండల ప్రజలపై విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష.**

**ఘన స్వాగతం పలికిన తల్లాడ గణేష్ ఉత్సవ కమిటీలు.**

**శాలువాలతో డాక్టర్ మట్టా దయానంద్ కు ఘన సన్మానం.**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 21:** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు సత్తుపల్లి నియోజకవర్గ,తల్లాడ మండల ప్రజలందరిపై ఎల్లవేళలా మెండుగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆకాంక్షించారు.

ఆదివారం తల్లాడ పట్టణంలో పర్యటించిన ఆయన వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తల్లాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోడూరి రాము, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొని గణేశుడిని దర్శించుకున్నారు. అనంతరం యాస గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ఆయన, మల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని కూడా సందర్శించారు.ప్రతి మండపం వద్ద నిర్వాహకులు, భక్తులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినం ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి,సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై గణేశుని కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని,ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు.

వివిధ వినాయక చవితి వేడుకలకు హాజరైన డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌ను గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులు,ఉత్సవ కమిటీ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి,ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు వేమిశెట్టి నాగన్న,జవ్వాజి నగేష్,లగడపాటి నెహ్రూ,అనుమోలు సర్వేశ్వరరావు, వేమిశెట్టి శంకర్,జిల్లా కమిటీ ముఖ్య నాయకులు,తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,మహిళా సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గణేష్ ఉత్సవాలు



బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్, ప్రగతినగర్ లలో గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులు భక్తి, శ్రద్దలతో ఘనంగా పూజలు నిర్వహించారు. పెద్దలకు,పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. బండారి లేఔట్ రోడ్ నంబర్ 4ఏ లోని అక్షయ క్యాస్టల్ అపార్ట్మెంట్ లో మొదటి సారిగా గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లడ్డు వేలం పాటలో హన్మంత్ రావు 12,500 దక్కించుకున్నారు. శాంతి,భద్రతలలో భాగంగా స్థానిక పోలీస్ అధికారులు,సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

# ఆ వందల ఎకరాల్లో మా వాటా ఎక్కడుందో కేటీఆర్ చెప్పాలి: రమ్యారావు

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుందన్న రమ్యారావు**

**కేటీఆర్ కు సంతోశ్ రావు బినామీ అని ఆరోపణ**

**చెప్పులు కూడా లేని సంతోశ్ రావుకు వందల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్న**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన ప్రజా పాలన అందిస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు 22ఏ పేరిట రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు, కేసీఆర్ సొంత అన్న కూతురు రమ్యారావు మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు దోచుకుందని ధ్వజమెత్తారు.

గతంలోనే తమకు వందల ఎకరాల భూములు ఉన్నాయని ప్రకటనలు చేస్తున్న కేటీఆర్.. అందులో మా వాటా ఎక్కడుందో చెప్పాలని రమ్యారావు డిమాండ్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోశ్ రావు కేటీఆర్‌కు బినామీ కాబట్టే ఆయన ఆస్తులపై ప్రశ్నించకుండా మౌనంగా ఉంటున్నారా? అని ప్రశ్నించారు.

గతంలో చెప్పులు వేసుకునే పరిస్థితి కూడా లేని సంతోశ్ రావుకు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భవనం, కొండాపూర్, మార్కుక్ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు, నానక్‌రామ్‌గూడలో ఆయన భార్య రోహిణి పేరిట భారీ కమర్షియల్ భవనాలు ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రాజెక్టుల ముంపు పేరుతో కుదురుపాక గ్రామానికి సంబంధం లేని సంతోశ్ కుటుంబ సభ్యులు అక్రమంగా 8 ఇళ్ల ప్లాట్లను పొందారని, అయితే 2018 రాజ్యసభ అఫిడవిట్‌లో కేవలం ఒక్క ప్లాట్‌ను మాత్రమే చూపి సమాచారాన్ని దాచారని ఆరోపించారు. కేసీఆర్ దగ్గర ఉంటూ అడ్డగోలుగా సంపాదించిన సంతోశ్ రావును వెనకేసుకొస్తూ... కవితను, ఇంటి నుంచి బయటకు పంపిన వైనంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని రమ్యారావు సవాల్ విసిరారు.

# నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో ఘనంగా ముగిసిన ‘ఓజోన్ రన్ ఫర్ హ్యాపీనెస్’ 5వ ఎడిషన్






హైదరాబాద్ – సెప్టెంబర్ 20, 2026: ‘స్వాన్’ (సేవ్ వాటర్ అండ్ నేచర్) సంస్థ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ శ్రీమతి మేఘన ముసునూరి, ఓజోన్ రన్ వ్యవస్థాపకులు శ్రీ తీర్థ వున్నం మరియు రేస్ డైరెక్టర్ శ్రీమతి కొయ్య సుధారాణి నేతృత్వంలో నిర్వహించిన ‘ఓజోన్ రన్ ఫర్ హ్యాపీనెస్ – 5వ ఎడిషన్’ ఆదివారం నెక్సస్ హైదరాబాద్ మాల్ ప్రాంగణంలో అత్యంత వైభవంగా ముగిసింది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDGs) సాధనే ధ్యేయంగా సాగిన ఈ ప్రజా ఉద్యమంలో వేలాది మంది పౌరులు, కుటుంబాలు, విద్యార్థులు మరియు రన్నర్లు 2ఖ, 5ఖ, 10ఖ మరియు 20ఖ విభాగాల్లో విశేషంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం రన్నర్లకు సరికొత్త అనుభూతిని అందించింది. 10K మరియు 20K టైమ్డ్ రన్నర్లు మీదికుంట చెరువు ప్రకృతి ఒడిలో ప్రకృతి రన్ పూర్తి చేయగా, 2K మరియు 5K ఫన్ రన్స్ నెక్సస్ మాల్ ప్రాంగణంలోనే సరదా ఆటలు, సవాలుతో కూడిన ఆక్టివిటీ జోన్లతో కుటుంబ సమేతంగా సందడిగా సాగాయి.

ఈ వేడుకకు సైబరాబాద్ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్, IPS, తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ జయేష్ రంజన్, IAS మరియు ‘బ్రింగ్ ఎ స్మైల్ ఫౌండేషన్’ వ్యవస్థాపకురాలు శ్రీమతి అర్చన సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంచడంలో ‘స్వాన్’ చేస్తున్న విశేష కృషిని వారు అభినందించారు.

పర్యావరణ సేవలకు గానూ పలువురికి ‘క్లైమేట్ యాక్షన్ అంబాసిడర్ అవార్డులు’, ‘ఓజోన్ అంబాసిడర్ గుర్తింపులు’ ప్రదానం చేయడంతో పాటు, 10ఖ మరియు 20ఖ విభాగాల విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (ESG) పాటించిన భాగస్వాములను మరియు స్పాన్సర్లను ఘనంగా సత్కరించారు. ఈ ఈవెంట్ విజయవంతం కావడానికి సహకరించిన వెన్యూ పార్టనర్ నెక్సస్ హైదరాబాద్ మాల్ ప్రతినిధులు శ్రీ అరవింద్ జీ, శ్రీ మంగేష్ జీలతో పాటు వేదికను పంచుకున్న ఓసిస్ స్కూల్, సిటిజన్స్ హాస్పిటల్, అమూర్ హాస్పిటల్, ఆర్.ఆర్ జ్యువెలర్స్, క్యూరా పాడ్, కీస్టోన్ స్కూల్, ది శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్, నారాయణ విద్యాసంస్థలు, కార్నర్ స్టోన్, హైవిజన్ ఫౌండేషన్, యూత్ ఫర్ సేవా మరియు డ్రెస్ కోడ్ ప్రతినిధులకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

“ఓజోన్ రన్ కేవలం ఒక క్రీడా పోటీ మాత్రమే కాదు; ఇది నగర వాతావరణాన్ని ‘గ్రే నుండి గ్రీన్’గా మార్చే పౌర ఉద్యమం. ఈ రోజు నగరవాసుల నుంచి వచ్చిన విశేష స్పందనే ఇందుకు నిదర్శనం” అని స్వాన్ సంస్థ ఛైర్‌పర్సన్ మేఘన ముసునూరి తెలిపారు.

# హాస్టల్ పరిసరాల్లో చెత్తాచెదారం.. విద్యార్థుల భద్రతపై ఆందోళన

## పిచ్చి మొక్కలు తొలగించి.. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి: బీజేపీ

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 21:** సత్తుపల్లి పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ బాలబాలికల హాస్టల్ పరిసరాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించి విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. హాస్టల్ చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తాచెదారం, విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు, వీధి దీపాల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



మున్సిపాలిటీకి సమీపంలోనే ఉన్న హాస్టల్‌లో అనేకమంది విద్యార్థులు నివసిస్తున్నారు. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లి తిరిగి వచ్చే విద్యార్థులు రాత్రివేళ వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్ సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోవడంతో దోమలు, పాములు, తేళ్ల బెడద ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనికి తోడు చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్య సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు.

పట్టణ అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు సంబంధించిన మౌలిక సదుపాయాలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీజేపీ నాయకులు కోరారు. హాస్టల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, పిచ్చి మొక్కలను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు విద్యార్థులు రాకపోకలు సాగించే మార్గాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

బీజేపీ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు బానోతు విజయ ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జొన్నలగడ్డ నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, టౌన్ కార్యదర్శి సాయి వర్ధన్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వెదుళ్ల వీరబాబు, బండి ఆంజనేయులు, బట్టి శివ సాయి తదితరులు హాస్టల్ పరిసరాలను పరిశీలించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## సర్కారు దవాఖానాలో దారుణం: శవాన్ని పీక్కుతిన్న ఎలుకలు

వరంగల్ వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అమానుషం.. ఫ్రీజర్ లేకపోవడంతోనే ఘోరం.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ తీరుకు అద్దం పడుతూ వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలోగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది.మార్చురీలో భద్రపరిచిన మృతదేహాన్ని ఎలుకలు కొరికి తినడం తీవ్ర కలకలం రేపింది.వరంగల్ జిల్లాకు చెందిన గారె వీరయ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.శవపంచనామా మరియు పోస్టుమార్టం నిమిత్తం శనివారం రాత్రి ఆయన మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం కుటుంబ సభ్యులు వెళ్లగా, మృతదేహంపై కంటి భాగాలను ఎలుకలు పీక్కుతిన్న ఆనవాళు కనిపించాయి.మార్చురీ గదిలో మృతదేహాలను భద్రపరిచేందుకు కనీస వసతులు, ఫ్రీజర్ సౌకర్యం లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య లోపం, సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికులు, ప్రజా సంఘాలు మండిపడ్డారు.తక్షణమే ఆసుపత్రిలో ఆధునిక వసతులు, ఫ్రీజర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళనకు దిగారు.

# యాతాలకుంట టన్నెల్ పనులపై మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీ

## లక్ష్యం మేరకు పనులు పూర్తి చేసి గోదావరి జలాలను విడుదల చేయాలి.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 21:** సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ పనుల పురోగతిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట వద్ద జరుగుతున్న టన్నెల్ పనులను ఆయన తనిఖీ చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్ పనుల పరిస్థితిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించే క్రమంలో మంత్రి తుమ్మల యాతాలకుంట టన్నెల్ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. పనుల పురోగతి, ప్రస్తుత పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలపై ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.





యాతాలకుంట టన్నెల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, సత్తుపల్లి ట్రంక్‌కు లక్ష్యం మేరకు గోదావరి జలాలను విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పనుల విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మంత్రి తుమ్మల వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇరిగేషన్ శాఖ అధికారులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ తదితరులు ఉన్నారు.

# సింగూరు ప్రాజెక్టులో ఈ ఎన్ సి తనిఖీ







**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 21 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** సంగారెడ్డి జిల్లాలో గల సింగూరు ప్రాజెక్టులో కొనసాగుతున్న, వివిధ అభివృద్ధి పనులను ఇరిగేషన్ (ఈ ఎన్ సి ) పరిశీలించారు, అలాగే (హెచ్ డబ్ల్యూ ఎం ఎస్) మిషన్ భగీరథకు తాగునీటి సరఫరా కోసం, నీటి లభ్యత సరపర పరిస్థితిని సమీక్షించారు, ఈ సందర్భంగా ప్రాజెక్టులో జరుగుతున్న పనుల పురోగతిని, అధికారులు పరిశీలించి, తాగునీటి సరఫరాకు సంబంధించిన, అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు, ఈ తనిఖీల్లో సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్ ( సి ఈ) సూపరిండెంట్ ఇంజనీర్ (యస్ ఈ ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ) మిషన్ భగీరథ (ఈఈ) (హెచ్ డబ్ల్యూ ఎం ఎస్ )( ఈఈ ) తదితర అధికారులు పాల్గొన్నారు....

# మూడు నెలల వేతనాలు చెల్లించాలి



**జహీరాబాద్, సెప్టెంబర్ 21 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. నెలనెలా ఒకటో తేదీన బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయడంతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. కనీస వేతనాలు అమలు చేయకుండా పనిచేయిస్తున్నా, వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం సరికాదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శాంతమ్మ, గోపాల్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్, పుట్నాల మిల్లుపై చర్యలు తీసుకోవాలి

**జహీరాబాద్, సెప్టెంబర్ 21 ప్రజాబలం ప్రతినిధి:** అల్గోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 137లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న వెంచర్, పుట్నాల మిల్లు నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. వెంచర్‌కు సంబంధించి లేఅవుట్ అనుమతులు, పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం స్థలం సమర్పించలేదని పేర్కొన్నారు. అదే సర్వే నంబరులో పంచాయతీ అనుమతులు లేకుండా పుట్నాల మిల్లు నిర్మిస్తున్నారని తెలిపారు. సంబంధిత పత్రాలను సమర్పించాల్సిందిగా కోరినా స్పందించలేదని, తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



**జహీరాబాద్, సెప్టెంబర్ 21 ప్రజాబలం ప్రతినిధి:** హుగ్గేలి సెక్టార్ పరిధిలోని రంజోల్-6 అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ్ మహాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుశీల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు, తృణధాన్యాలతో కూడిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# లంబోదరుడి సేవలో ఎమ్మెల్యే



**జహీరాబాద్, సెప్టెంబర్ 21 ప్రజాబలం ప్రతినిధి:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు వినాయక మండపాలను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శాంతినగర్, ఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లోని మండపాలను సందర్శించి విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజల కష్టాలు, విఘ్నాలు తొలగి ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహిపాల్ యాదవ్, సుజిత విశ్వేశ్వర్, నాయకులు యాకూబ్, అబ్దుల్లా, వెంకట్‌సాగర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం



ఈరోజు రామంతాపూర్ చెరువు సమీపంలో తెలంగాణ రాష్ట్ర ఆరే కటిక సంగము ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా హైదరాబాద్ ఆరే కటిక సంగము నాయకులు, సభ్యుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

త్వరలో జరగబోయే ప్రధాన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సంఘం పెద్దలు శ్రీ ప్రేమ్లాల్ నేతికర్ గారి చేతుల మీదుగా వైభవంగా నిర్వహించనున్నారు.

ఈరోజు జరిగిన కార్యక్రమంలో:

బాలాజీ గోగికర్, మంజురకర్ శామ్, ఘనశ్యామ్, జమాల్పూర్ సాయి, సూర్యాభాయ్, ఎమ్మెల్యే వెంకటేశ్, ఎమ్మెల్యే నర్సింహారావు, జానకిరామ్, పంతులు రాకేష్ తదితర నాయకులు, సంఘం పెద్దలు మరియు సభ్యులు పాల్గొన్నారు.

వారి సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో భీమా యూత్ ఆధ్వర్యంలో అన్నదానం..



**కూకట్‌పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్21:** వినాయక చవితి సందర్భంగా కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో భీమా యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వంశీ కృష్ణ, కార్తిక్ శెట్టి, ప్రశాంత్, రిత్విక్ రెడ్డి, సన్నీ, పాండు, బన్నీ, శేషాంక్, ఆదిత్య, తరుణ్, కాగ్రే మల్లేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, ఆందోల్ నియోజకవర్గ పర్యటన .

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సేప్టెంబర్ 21 (,ప్రజబలం)సంగారెడ్డి జిల్లా,:** ఈపర్యటనలో...ఆందోల్ మండలంలోని డాకూర్ లోని (సీ యస్ ఐ) చర్చిలో ప్రత్యేక ప్రార్థనలునిర్వహించారు.పర్యటన లోభాగంగా వట్పల్లి,మండలం ఉసిరిక పల్లి,గ్రామంలో మాజీ సర్పంచ్ మన్నే నర్సింలు, గారి ప్రథమ వర్ధంతి, సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలోపాల్గొన్నారువారి వర్ధంతిసందర్భంగామంత్రిఘనంగనివాళు లర్పించారు.అనంతరం, ఉసిరికపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ జెడ్పిటిసి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల రాంరెడ్డిని, మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటన లో భాగంగా మార్వెల్లి, గ్రామం లో కార్యకర్తలతోసమావేశమయ్యారు. శ్రీ సిద్ధివినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట(పీసీసీ )ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు విశ్వాస్, మాజీ అధ్యక్షులు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కచర్ రావు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు శేరి జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, దిగంబర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అల్లదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి , పెద్దపట్ల వినయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.....

# మాజీ ఎంపిపి వావిలాల నర్సింలు కు డీజెఎఫ్ ఆహ్వానం

**దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే డీజెఎఫ్ ధ్యేయం**

**జర్నలిస్టులకు సంక్షేమ సదుపాయాలు కల్పించాలి**

**రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి ముక్కగల్ల యాదన్న**

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 21 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అక్టోబర్ 7న సంగారెడ్డిలోనిర్వహించనున్న దళిత జర్నలిస్టుల ఫోరం (డీజెఎఫ్) 11వ రాష్ట్ర మహాసభలకు హత్నూర మాజీ ఎంపీపీ వావిలాల నర్సింలును డీజెఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, జిల్లా సలహాదారు కిషన్ రావు సోమవారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముక్కగల్ల యాదన్న మాట్లాడుతూ, దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చి పోరాడటమే డీజెఎఫ్ ధ్యేయమని తెలిపారు, దళిత జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య, అర్హులైన వారికి ఉచిత బస్, రైలు పాసులు, నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించడంతో పాటు, అకాల మరణం చెందిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు, సంగారెడ్డిలో జరిగే రాష్ట్రమహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యాదన్న పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పరమేషుల కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు..



# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

**నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి.**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 21** ములుగుఈ నెల 23న నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి గుర్తించిన ప్రాంతాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను అంచనా వేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బారికేడ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో సామర్థ్యానికి మించి ప్రజలు గుమిగూడకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఊరేగింపులు నిర్ణీత మార్గాల్లో, నిర్ణీత సమయాల్లో కొనసాగేలా ఉత్సవ కమిటీలకు ముందస్తు సూచనలు ఇవ్వాలన్నారు.

నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యుత్ తీగలు, స్తంభాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు రెప్పపాటు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యామ్నాయ విద్యుత్ దీపాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

జలాశయాలు, చెరువులు, వాగుల వద్ద నీటి పరిస్థితులను నీటిపారుదల, మత్స్య శాఖల అధికారులు పరిశీలించాలని తెలిపారు. నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను నిర్ధారించి అవసరమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు నీటి ప్రదేశాల సమీపానికి వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి నిమజ్జన ప్రాంతంలో వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉండాలన్నారు.

అన్ని మండలాల్లో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు,

తహసీల్దార్లు, ఎంపిడిఓ శ్రీబ తమ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు.

సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని, అత్యవసర సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని పురపాలక, పంచాయతీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు.

లోటుపాట్లకు తావులేకుండా రెవెన్యూ, పోలీసు, పురపాలక, పంచాయతీ, మత్స్య, గనులు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భూగర్భ జల, రహదారులు భవనాలు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, ఆర్డీవో కృష్ణవేణి, ములుగు పురపాలక కమిషనర్, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి, గనులు భూగర్భ శాస్త్ర శాఖ సహాయ సంచాలకుడు, సహాయ కార్మిక అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డీఎస్పీ డీసీఆర్బీ, జిల్లా అగ్నిమాపక అధికారి, భూగర్భ జల శాఖ ఉప సంచాలకుడు, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటిపారుదల అధికారి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు,

పోలీస్ స్టేషన్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రామ్ నరేష్ నగర్ లో ఘనంగా ముగిసిన అంబాదాస్ జన్మదిన వేడుకలు..

## అత్యధిక సంఖ్యలో హాజరైన మిత్రబృందం



శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )సెప్టెంబర్ 21 శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని హైదర్ నగర్ రామ్ నరేష్ నగర్ వివాహితుడు హైదర్ నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు అంబాదాస్ జన్మదిన వేడుకలను కాలనీవాసులు మిత్రులు శ్రేయో భిలా షుల మధ్య అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తోటి మిత్రులు కాలనీ అధ్యక్షులు నక్క శ్రీనివాస్ కానీ గనివాసితులైన కాలనీవా సులు పెద్ద ఎత్తున అంబదాస్



ఇంటికి చేరుకుని ఆయనకు శాలువతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేసి మిఠాయిలను తినిపిం చారు. ఈ సందర్భంగా అంబదా స్ మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా తన జన్మదిన వేడుకలకు కాలనీవాసులతో పాటు తోటి మిత్రులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున చేరుకొని నా జన్మదిన కార్యక్రమంలో పాల్గొని నన్ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసుకుంటున్నట్లు జన్మదినం వేడుకలను జరుపుకున్న అంబాదాస్ మీడియా ప్రతినిధితో తన మనసులోని భావాన్ని వ్యక్తం పరిచారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అరుణ్ కుమార్ సీనియర్ నాయకులు బాగానే శ్రీనివాస్ వీరాచారి ఉపాధ్యక్షులు నాగరాజు కోటేశ్వరరావు ఈ జిల్లా అధ్యక్షులు సీతారామరాజు సంఘని కృష్ణ బాలాజీ బద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే మా ప్రాణం అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## ప్రతి పేదవాడికి కాంగ్రెస్ అంటేధైర్యం



వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 21(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా;మర్పల్లి మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో సి.ఎం.ఆర్.ఎఫ్ / కళ్యాణ లక్ష్మి చెక్కులు ఎంపీడీవో మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఎమ్మార్వో మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ కొత్లాపూర్ మాజీ సర్పంచ్ వైద్యనాథ్ మరియు వార్డ్ మెంబర్ నవీన్ కుమార్ చేతుల మీదుగా చెక్కులుఅందజేయడం జరిగింది. ప్రజలు ఎలాంటి ఆందోళన పడొద్దు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు యధావిధిగా కొనసాగుతాయని గౌరవ ముఖ్యమంత్రి ఆదేశించారు ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే అలాంటివి నమ్మవద్దని వార్డు మెంబర్ నవీన్ కోరారు...

# ఆయుర్వేదంతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం

## 11వ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు




వేములవాడ ప్రజాబలం ప్రతినిధి ( సెప్టెంబర్ -21)వేములవాడ పట్టణంలోని ఆయుష్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా సోమవారం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఎంఆర్ఓ కార్యాలయం సమీపంలోని పార్కులో మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి, ఆరోగ్యకరమైన జీవనశైలిలో ధ్యానం, యోగా ప్రాధాన్యతను వివరించారు.

అనంతరం పోషణ అభియాన్‌లో భాగంగా 11వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు.ఆయుర్వేదం మన జీవన వేదమని, ప్రకృతి ఆధారిత జీవన విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కార్యక్రమంలో వివరించారు. అలాగే ప్రతిరోజూ యోగా, ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడిని తగ్గించుకోవడంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ సంగీత, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఎస్‌డీపీఓ, ఫార్మసిస్ట్ పుష్పలత, యోగా టీచర్ ఎలిగేటి కృష్ణ, రిషిక, డీపీఎం తిరుపతి తదితరులతో పాటు అంగన్వాడీ ఆయాలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# మర్పల్లి చెక్కుల పంపిణీపేదల పెద్దన్నయ్య రేవంత్ రెడ్డి, మర్పల్లి పార్టీ

## అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు




వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 21 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం ప్రియతమ నాయకులు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి స్పీకర్ ఆదేశాల మేరకుమర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయడం జరిగిందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు కళ్యాణ లక్ష్మి చెక్కులు 71 నిరుపేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు అందజేయడం జరిగింది అదేవిధంగా




సీఎంఆర్ఎఫ్26 చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు మర్పల్లి మండలానికి 16 లక్షల 48 వేల ఐదు వందల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు పేదింటికల్లా పెద్దన్నయ్యగా తెలంగాణ ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి చెక్కులు నిరంతరం వెనివెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఆడబిడ్డల ప్రేమ గళ్ళ పెద్దన్నయ్య రేవంత్ రెడ్డి వెనువెంటనే కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ కష్టాల్లో ఉన్న కుటుంబాలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చి సీఎంఆర్ ఐ చెక్కులు లబ్ధిదారులకు అందజేయడం నిజంగా ఇది చాలా గర్వకారణం అని మర్పల్లి గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్ తెలిపారు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఎమ్మార్వో మనోహర్ చక్రవర్తి, ఎంపీడీవో శాంతమ్మ, జిల్లా నాయకులు, కృష్ణారెడ్డి, యు రవీందర్ స్థానిక సర్పంచ్ మధు గు రామేశ్వర్, పట్లూర్ సర్పంచ్ పరశురాం, మరియు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు ఉప్పరినగేష్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ యాదవ్, రాచ న్న, దివాకర్, మహమ్మద్ గౌస్, మహమ్మద్ సలీం, పాండురంగా రెడ్డి,లబ్ధిదారులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమక్షంలో చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు

# ప్రజా సేవలో పరిశుభ్రతకు ప్రాధాన్యత

## వెంగన్నపేట గ్రామ సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 21:ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న వెంగన్నపేట గ్రామ సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ అన్నారు.




సోమవారం వెంగన్నపేట గ్రామంలో రహదారి వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు
వర్షపు నీరు నిల్వ ఉండడంతో కాలువలను శుభ్రం చేయించారు.
కాల్వ ద్వారా నీటిని బయటికి మళ్ళించారు.
వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు భాగంగా దోమల నివారణకు సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ ఆధ్వర్యంలో




బ్లీచింగ్ ప్రతి వీధిలో చెల్లించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కేవలం గ్రామపంచాయతీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని అన్నారు. ప్రతి వార్డులోని ప్రతి పౌరుడు, ప్రతి మహిళ తమ తమ వీధులను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని కోరారు.మన ఊరు మన పరిశుభ్రత అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, మన ఇల్లు ఎంత పరిశుభ్రంగా ఉంటుందో మన వీధులు, పరిసరాలు కూడా అంతే పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ
గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ బోడ మౌనిక బాలకృష్ణ తీరుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

## కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి దేవస్థానం తరుపున పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం తరుపున పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభమైన కాణిపాక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేదీన ముగియనున్నాయి. ఈ మేరకు శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు జి. లక్ష్మీశ్వరి, జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, వాయిగండ్ల వెంకటేశ్వర్లు, ఆకుల శ్రీనివాసులు, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు, తదితరులు ఈ పట్టువస్త్రాలను సమర్పించారు.ఈ సమర్పణ కార్యక్రమములో పూతలపట్టు నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు డా. కె. మురళీ మోహన్, కాణిపాక దేవస్థాన ధర్మకర్తల మండలి వి. సురేంద్రబాబు, కార్యనిర్వహణాధికారి కె.పెంచలకిషోర్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. అనంతరం ఈ దేవస్థానం అధ్యక్షులను, ధర్మకర్తల మండలి సభ్యులను, అధికారులను, అర్చకస్వాములు, వేదపండితులు వేదాశీర్వచనముతో సత్కరించారు.కాగా ఆలయ సంస్కృతి సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిసంవత్సరం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సమయములో శ్రీశైల దేవస్థానం తరపున ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతోంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com